
ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

బుధవారం 10 సెప్టెంబరు 2025





నిండుకుండలా సోమశిల

- ప్రాజెక్టులో 70 టీఎంసీలు దాటిన నీరు
- మరో 4 టీఎంసీల నిల్వకు చర్యలు
- అధికారుల అప్రమత్తం

అనంతసాగరం సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం నాటికి 70 టీఎంసీలు దాటింది.దీంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. పూర్తిసామర్థ్యం 77.988 కాగా ఈసారి 74 టీఎంసీలు నిల్వ చేసి అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. రోజువారీగా సరాసరి 2 టీఎంసీలు వస్తుండగా అతితక్కువ సమయంలో సోమశిల, కండలేరు జలాశయాలు పూర్తినిల్వకు చేరుకొన్నాయి. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 19,510 క్యూసెక్కులు వస్తుండగా 70.230 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 9,200, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

• 11 నుంచి నీటి విడుదల?

సోమశిల పూర్తి సామర్థ్యం వైపు పరుగుతీస్తుండగా ఈ నెల 11 నుంచి దిగువ ప్రాంతానికి నీరు విడుదల చేసే సూచనలు ఉన్నాయి. ఈ మేరకు సోమశిల అధికారులు రెవెన్యూ, పోలీసు అధికారులను అప్రమత్తం చేస్తూ డీఈ రవీంద్రప్రసాద్ లేఖ విడుదల చేశారు. నీటి విడుదల సమయంలో ప్రజలు పెన్నా పరివాహక ప్రాంతాలకు వెళ్లవద్దని, పశువులను మేతకు తీసుకువెళ్లవద్దని తెలియజేశారు. స్థానిక యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు.

నేటి నుంచి స్కూల్‌గేమ్స్ ఎంపికలు

నెల్లూరు(విద్య), సెప్టంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించే అండర్-19 స్కూల్ గేమ్స్ ఎంపికలు బుధవారం నుంచి జరుగుతాయని, ఇందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీవీఈవో బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని కేవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని పీడీలు ఎంపికలను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటి కప్పుడు నివేదికలు అందచేయాలని కోరారు. బుధవారం ఏసీ సుబ్బా రెడ్డి స్టేడియంలో ఆర్చరీ, గట్కా క్రీడా ఎంపికలు, ఇందుకూరుపేట మండలం కొత్తూరులో సెపక్‌తక్రా ఎంపికలుం టాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో టీ వర ప్రసాద్‌రావు, కేవీసీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివా సులు రెడ్డి, అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పీ వేణు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో మొక్క నాటుతున్న ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తదితరులు

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి

- అభినందన సభలో ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ

ఆత్మకూరు/రాపూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి పాటుపడాలని ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పిలుపునిచ్చారు మంగళవారం జిల్లాలోని రాపూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి, అభినందించారు. ఆర్టీసీ ప్రాంగణాలలో మొక్కలు కూడా నాటారు. ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో ఎండీ మాట్లాడుతూ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా వారు కృషి చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను ఓఎస్ -15 పథకం కింద ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఈడీ అప్పలరాజు, నెల్లూరు జోన్ -3 ఎగ్జిక్యూటర్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్, డీటీపీవో షేక్ సమీమ్, డీఎంలు శివకేశ్ యాదవ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డు

నెల్లూరులో గందరగోళంగా పంపిణీ ప్రక్రియ

వలసదారులకు తప్పని ఇబ్బందులు

వచ్చిందో.. లేదో!?

సచివాలయ సిబ్బంది, డీలర్ల మధ్య సమన్వయలోపం • అర్బన్‌లో 36.68 శాతమే పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ముఖ్యంగా నెల్లూరు అర్బన్‌లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ గందర గోళంగా మారింది. ఎంతోకాలంగా కొత్త కార్డుల కోసం, ఉన్న కార్డులలో మార్పు, చేర్పుల కోసం ఎదురు చూసిన వారిలో స్మార్ట్ కార్డుల పంపిణీ ఆనందం నింపింది. అయితే ఈ కార్డుల పంపిణీనే గందరగోళానికి దారి తీసింది. వలంటీర్లు మ్యాపింగ్ చేయడంలో ఏర్పడిన గందరగోళం ఇప్పడు కార్డుల పంపిణీకి విఘాతం కలుగుతోంది. ఉదాహరణకు వెంకటాచలం నుంచి నెల్లూరులో స్థిరపడిన కార్డుదారులు తాను వెంకటాచలం నుంచి నెల్లూరుకు వచ్చానని, మ్యాపింగ్ చేసిన వలంటీర్‌కు లేదా డీలర్‌కు చెప్పకపోవటంతో వారి కార్డులు వెంకటాచలానికి చేరాయి. దీంతో కార్డుదారులు నగరంలో సరుకులు పొందుతున్న డీలర్ వద్దకు వెళుతున్నారు. కానీ డీలర్లు సరుకులు ఎక్కడనుంచైనా తీసుకొనే పోర్టబులిటీ ఉండటంతో సరకులు ఇచ్చామని, సచివాలయానికి వెళ్లాలని సూచిస్తున్నారు. సచివాలయానికి వెళితే అక్కడున్న సిబ్బంది మీ కార్డు మా దగ్గర లేదు. డీలర్ వద్దకు వెళ్లమని సూచిస్తున్నారు.

డీలర్, సచివాలయ సిబ్బంది సరైన సమాచారం ఇవ్వకపోవటంతో స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందని పరిస్థితి ఏర్పడింది.

• నెల్లూరులో దారుణంగా..

నెల్లూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ అస్తవ్యస్థంగా ఉంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగాలు, పనుల కోసం వలసవచ్చి స్థిరపడిన వారు ఎందరో ఉన్నారు. వీరందరి కార్డులు వారి స్వస్థలాల తహసీల్దారు కార్యాలయాలకు వెళ్లినట్లు సమాచారం. వారి ద్వారా సచివాలయాలకు వెళ్లాయి. నెల్లూరు అర్బన్‌కు 63,422 స్మార్ట్ కార్డులు రాగా ఇప్పటివరకు 23,262 కార్డులను పంపిణీ చేశారు.



కోవూరులో లబ్ధిదారుకు స్మార్ట్ కార్డు అందజేస్తున్న చేస్తున్న డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి

కార్డుల పంపిణీ ఇలా

ప్రాంతం	శాతం
కోవూరు	80.53
పొదలకూరు	84.34
గుడ్లూరు	80.36
సైదాపురం	80.21
జలదంకి	80.79
ఇందుకూరుపేట	84.89
మర్రిపాడు	81.12
మనుబోలు	81.16
వెంకటాచలం	80.55
కలిగిరి	84.19
దగదర్తి	82.98
కలువాయి	84.87
ఏఎస్‌పేట	80.88
రాపూరు	85.93
వరికుంటపాడు	80.11
ఉదయగిరి	84.13
చేజర్ల	84.72
దుత్తలూరు	84.20
నెల్లూరు అర్బన్	36.68
నెల్లూరు రూరల్	54.86

ఇంకా 40,160 కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. నెల్లూరు రూరల్‌కు 82,862 కార్డులు కార్డులు రాగా ఇప్పటివరకు 45,455 కార్డులను పంపిణీ చేశారు. ఇంకా 37,407 కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. జిల్లాకు మొత్తం 7,10,998 కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు రాగా, ఇప్పటివరకు 5,07,375 కార్డులను పంపిణీ చేశారు. ఇంకా 2,03,623 కార్డులు (71.36 శాతం) పంపిణీ చేయాల్సి ఉంది. కందుకూరులో 71.54 శాతం, కావలిలో 71.25 శాతం, ఆత్మకూరులో 78.79శాతం పంపిణీ జరిగింది. నెల్లూరు రూరల్ అర్బన్, ఇతర మున్సి పల్ ప్రాంతాలలో డీలర్లు వెళ్ల కుండా సచివాలయ సిబ్బంది ఈ కార్డులను పంపిణీ చేస్తున్నారు. దీంతో సమస్య తలెత్తింది. జిల్లాలోని గ్రామీణ మండలాల్లో డీలర్లు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో స్మార్ట్‌కార్డుల పంపిణీని అద్భుతంగా చేస్తున్నారు. డీలర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడం వలన 80శాతానికి దాటింది. కానీ పట్టణ ప్రాంతాలలో సచివాలయ సిబ్బందిపై మాత్రమే ప్రక్రియను వదిలేయడంతో పంపిణీ చేయలేక పోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

జీజీహెచ్ వైద్యుడు ధీరజ్‌కు స్వర్ణ పతకం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో న్యూరోసర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ జొన్నలగడ్డ ధీరజ్ రాష్ట్ర గవర్నర్ నజీర్ అహ్మద్ నుంచి ప్రొఫెసర్ ఎంఆర్‌సీ నాయుడు గోల్డ్ మెడల్ అందుకున్నారు. మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆయన ఈ పతకం అందుకున్నారు. 2021 - 22 సంవత్సరానికి సం బంధించి యూనివర్సి టీలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచి న్యూరాలజీ విభాగంలో పట్టా పుచ్చుకున్నందుకు డాక్టర్ ధీరజ్‌కు స్వర్ణ పతకం లభించింది. ప్రజలకు మరింతగా వైద్య సేవలు అందించేందుకు ఈ మెడల్ స్ఫూర్తినిస్తుందని పతక గ్రహీత పేర్కొన్నారు.



గవర్నర్ నుంచి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న ధీరజ్

కోవూరులో మద్యం 'సిట్ 'విచారణ

కోవూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని కుదిపేస్తున్న మద్యం కుంభకోణాన్ని పరిశోధిస్తున్న సిట్ అధికారులు మంగళవారం కోవూరులో ఓ రియల్టర్‌ను రహస్యంగా విచారించారు. పట్టణానికి చెందిన దేగపూడి ప్రభాకరరెడ్డికి మద్యం కేసులో నిందితుడి ఉన్న ధనుంజయ రెడ్డి సమీప బంధువు. గత ప్రభుత్వ హయాంలో ధనుంజయరెడ్డి ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేసే సమయంలో కోవూరులో 80 అంకణాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇటీవల ధనుంజయరెడ్డి ఆస్తుల గురించి సిట్ దృష్టి సారించడంతో కోవూరులో ఆయన స్థలం కొనుగోలు చేసిన విషయం వెలుగు చూసింది. దీంతో సిట్ అధికారులు ప్రభాకరరెడ్డిని విచారించారు. అంకణం ఎంతకు కొనుగోలు చేశారు.. ఎవరి వద్ద కొనుగోలు చేశారనే విషయాలను రాబట్టారు. మార్కెట్టు ధర ప్రకారమే ప్లాటును కొనుగోలు చేశారని ఆయన సిట్ అధికారులకు తెలిపారు. పాటూరు గ్రామానికి వెళ్ళే దారిలో ఏర్పాటుచేసిన ప్లాటు పరిసర ప్రశాంతంగా ఉండటంతో ధనుంజయ రెడ్డి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ప్రభాకరరెడ్డి స్టేట్‌మెంటు రికార్డు చేసినట్లు తెలిసింది. అలాగే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి కూడా కోవూరు, విడవలూరు మండలాల్లో పొలం కొనుగోలు చేశారని సిట్ అధికారులకు సమాచారం అందింది. ఈ విషయం మీద కూడా త్వరలోనే విచారించనున్నట్లు తెలిసింది.



రియల్టర్‌ను విచారిస్తున్న సిట్ అధికారులు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- జేసీకి వినతిపత్రం అందించిన వైసీపీ నేతలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. వైసీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రెవెన్యూ డివిజన్ కేంద్రాలైన నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరులలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు చేపట్టారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్‌సీ కూడలిలోని అంబేడ్కర్ చిత్రపటనికి పూలమాల వేసి ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకొన్నారు. రైతాంగ సమస్యలపై జేసీ కార్తిక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు యురియా బస్తా గతంలో రూ.270 ఉంటే ప్రస్తుతం 600 వరకు అమ్ముతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో కమీషన్లకు కక్కుర్తిపడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ ప్రైవేటు వ్యాపారులకు అందించారని విమర్శించారు. ఇందులో దాదాపు రూ.200 కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల కన్నీరు మంచిది కాదని, ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైసీపీ నాయకులు నల్లపురెడ్డి రజత్‌కుమార్, కాకాణి పూజిత పలువురు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



• సీపీఎం నిరసన ప్రదర్శన

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించాలంటూ మంగళవారం నెల్లూరులో సీపీఎం నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా మూలం రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కింద ఏ గ్రేడ్ రకానికి రూ.20,308, బి గ్రేడ్ రకానికి రూ. 20,130 ప్రకటించిందన్నారు. దీని ప్రకారం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనాలని కోరారు. మార్కెట్ కంటే దళారులు రూ.6వేలు, 4 వేలు తగ్గించికొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక తూకాల్లోనూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.

పౌరసంబంధాల శాఖ డీడీగా వేణుగోపాల్‌రెడ్డి



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసంబంధాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పి. వేణుగోపాల్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో పౌరసంబంధాల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా వేణుగోపాల్‌రెడ్డిపని చేస్తున్నారు. పదోన్నతిపై డిప్యూటీ డైరెక్టర్‌గా నెల్లూరుకు నియమితులయ్యారు.

ఎయిర్‌పోర్టుకు టెండర్లు

- ఆహ్వానించిన ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
- పీపీపీ మోడ్‌లో నిర్మాణం.. నవంబరు 10 వరకు గడువు

నెల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లావాసుల చిరకాల వాంఛ అయిన విమానాశ్రయ నిర్మాణంలో అడుగులు వేగంగా పడుతున్నాయి. గత నెలలో దగదర్తి వద్ద ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపగా, తాజాగా ఈ నిర్మాణానికి సంబంధించి ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. పబ్లిక్-ప్రైవేట్-పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలోని డీబీఎఫ్‌వోటీ (డిజైన్-బిల్డ్-ఫైనాన్స్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో ఎయిర్‌పోర్ట్ నిర్మించనున్నారు. ఈ పద్ధతిలో కాంట్రాక్టర్లు చూపించే ఆసక్తిని బట్టి కొంత ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. నవంబరు 10వ తేదీ వరకూ ఆసక్తి కలిగిన సంస్థలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి టెండర్లు దాఖలు చేసుకోవచ్చు. మొత్తం 1379 ఎకరాల్లో దగదర్తి వద్ద నిర్మించనున్న ఎయిర్‌పోర్టును గ్రీన్‌ఫీల్డ్ మోడ్‌లో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలోనే 814 ఎకరాలను ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు జిల్లా యంత్రాంగం అప్పగించింది. మిగిలిన భూమిని కూడా అప్పగించే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రణాళికలు రూపొందించింది. ఈ ఏడాది చివరి నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ సంస్థకు పనులు అప్పగించాలని అధికారులు భావిస్తున్నారు. కాగా జిల్లా పారిశ్రామికంగా, వ్యాపార పరంగా ఎంతో వృద్ధి చెందుతున్నా జిల్లావాసులకు విమాన సేవలు అందుబాటులో లేవు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలను కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో దగదర్తిలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి 2019లోనే అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయగా, పనులు కూడా మొదలయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పనులను అర్థాంతరంగా ఆపేసింది. ఆ తర్వాత ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో కదలిక వచ్చింది. అందుకు తగ్గట్లుగానే వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయి.

జనం కష్టాలు

'అనంత'ం!

- 'సూపర్' సభకు 260 పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు
- బస్సులు లేక గ్రామీణ ప్రజానీకం అవస్థలు
- సర్వీసులను సమకూర్చడంలో అధికారుల వైఫల్యం
- విచారణ కేంద్రంలో సమాధానం చెప్పేవారూ కరువే!

బస్సుల కొరత ఏర్పడటంతో ప్రైవేటు వాహనదారులు ఇష్టానుసారం చార్జీలు వసూలు చేశారు. చేసేది లేక ప్రయాణికులు కూడా ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వచ్చింది.

\- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

'సూపర్ సిక్స్‌సూపర్ హిట్' సభకు జనసమీకరణ కోసం జిల్లా నుంచి అనంతపురానికి ఆర్టీసీ సర్వీసులు తరలివెళ్లడంతో పల్లెజనం అవస్థలు ఎదుర్కొంది. గంటల తరబడి వేచిఉన్నా బస్సులు రాకపోవడంతో చివరకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. కనీసం బస్టాండ్లలో సమాచారం ఇచ్చే సిబ్బంది కూడా కరువయ్యారు. అనంతపురంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సభకు 260 బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయించారు. ఇవన్నీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కావడంతో పల్లెజనానికి అవస్థలు తప్పలేదు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయంలోనూ అధికారులు చేతులెత్తేశారు. మరోవైపు ఆర్టీసీ

కందుకూరులో బస్టాండ్‌లో..





నెల్లూరు : బస్సులు లేక బోసిపోయిన ప్రధాన బస్టాండు



హమ్మయ్య.. ఎంత సేపటికి బస్సు వచ్చింది..



కావలి : బస్సులు లేవు.. తప్పదు మరి!



అల్లూరులో..



కావలిలో ఎగబడుతున్న ప్రయాణికులు



ఉదయగిరి : ఎండలో మండిపోతూ..



పొదలకూరులో బస్సుల కోసం పడిగాపులు



అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

స్వప్న, తహసీల్దారు

ముత్తుకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ముత్తుకూరు తహసీల్దారు స్వప్న తెలిపారు. 2025 జూన్ 30 కంటే ముందు అనధికారికంగా ఏర్పాటైన లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అక్టోబరు 24 లోపు యాజమాన్య పత్రాలు 50 శాతం లేదా రూ. 10 వేలు తగ్గకుండా చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

?. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుక్కు న్న వారి పరిస్థితి ఏంటి

!. ప్లాటు యజమానులు ఎవరికి వారు క్రమబద్ధీకరించుకోవచ్చు. సెప్టెంబరు 19 లోగా మొత్తం ఫీజు చెల్లిస్తే పెనాల్టీ చార్జీల పై 10 శాతం తగ్గుతుంది. ఆన్‌లైన్‌లో ఏపీ డీపీఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోలి.

?. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తయిందా

!. మండలంలో 70 వాతం పైగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తయింది. స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకుని, సంబంధిత సచి వాలయాలు డీలర్ల వద్ద పొందవచ్చు. అర్హు లై ఉండి ఇప్పటికీ స్మార్ట్ రేషన్‌కార్డులు రాని వారికి రెండవ దశలో మంజూరు చేసి పంపిణీ చేస్తాం. అప్పటివరకు యథావిధిగా రేషన్ పొందవచ్చు.

?. రైతు పాసు పుస్తకాల పంపిణీ ఎంతవరకు వచ్చింది

!. కొత్త రైతు పాసు పుస్తకాల ముద్రణ పూర్తయింది. సాంకేతిక లోపాలున్న కారణంగా పరిశీలించి సరిచేస్తున్నాం. పూర్తయిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం.


నెలలోపు సర్టిఫికెట్లు తీసుకెళ్లండి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి):బుచ్చిరెడ్డిపాళెంలోని సెయింట్ మేరీస్ విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ మా రిందని, ఈ సంస్థలలో చదివిన ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, టీపీటీ, ఎంఈడీ, విద్యార్థులు నెల రోజుల్లోపు సర్టిఫికెట్లు తప్పకుండా తీసుకువెళ్లాలని సెయింట్ మేరీస్ విద్యాసంస్థల నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తరువాత కరస్పాండెంట్ రెడ్డి వెంకటరెడ్డి, సెక్రటరీ వెంకటసుబ్బమ్మ జవాబుదారీకాదని పేర్కొన్నారు.

రామచంద్రాపురంలో మళ్లీ వివాదం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పురందరపురం పంచాయతీ రామచంద్రాపురంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం ముదురుతోంది. ఎస్సీ కాలనీలోని ఓ వీధిలో వినాయక ప్రతిమ ఏర్పాటుపై రేగిన వివాదం ఇంటెలిజెన్స్ అధికారుల వరకు వెళ్లింది. అయితే చవితి నాడు ఈ వివాదం సద్దుమణిగినా సోమవారం రాత్రి మళ్లీ రేగింది. దీంతో పోలీసులు, తహసీల్దారు రంగ ప్రవేశం చేసి ఓ వర్గానికి కేటాయించిన స్థలంలో మంగళవారం ఫెన్సింగ్ వేశారు. అధికారుల తీరుపై బీజేపీ, ఆర్ఎస్ఎస్, సమ రత సేవా సంస్థల ప్రతినిధులు అభ్యంత రం వ్యక్తం చేశారు.

జై పోలేరమ్మ...



టెంకాయపై పోలేరమ్మ సూక్ష్మచిత్రాలు

మనుబోలు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పోలేరమ్మ జాతర సందర్భంగా సూక్ష్మ కళాకారుడు , వీరంపల్లి ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ సోమా పద్మారత్నం మంగళవారం వేపాకు, టెంకాయపై పోలేరమ్మ తల్లి చిత్రాలు వేసి జాతరభక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.



సర్వమత సమ్మేళనం..
కసుమూరు దర్గా!

నమ్మిన భక్తుల కొంగుబంగారం మస్తాన్‌వలి ● 18న 248వ గంధ మహోత్సవం

వెంకటాచలం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏ మతస్థులైనా తమ దైవాన్ని మాత్రమే భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఇతర మతాలను పూజించడానికి ఇష్టపడరు. ఇది సహజం. కానీ కసుమూరులో మాత్రం పరిస్థితి ఇందు కు భిన్నంగా ఉంటుంది. గ్రామంలో శతాబ్దాల క్రితం సమా ధి అయిన కాలేషాపీర్ (మస్తాన్‌వలి)ని ముస్లింలు మస్తాన్ వలి, కాలేషాపీర్ అని, హిందువులు మస్తాన య్యగానూ కొలుస్తారు. అంతేకాదు.. 'హిందూ-ముస్లిం భాయీ భాయీ' అంటూ రెండు మతాలవాళ్లు కలిసి ఉత్స వాలను వైభవంగా జరుపుతారు. అందుకే.. కసు మూరు మస్తాన్ వలి దర్గా సర్వమత సమ్మేళనంగా విరా జిల్లుతోంది. శారీరక, మానసిక రుగ్మతలను కూడా మస్తాన్‌వలి నయం చేస్తారని భక్తుల విశ్వాసం. . ఆంధ్ర, తెలంగాణ నుండే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర మొదలైన దక్షిణాది రాష్ట్రల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్య లో కసుమూరు మస్తాన్‌వలి దర్గాను సందర్శిస్తారు.

● అరబ్‌దేశాల నుంచి..

మస్తాన్‌వలి చిన్నతనంలోనే ఆధ్యాత్మిక చింతనతో అరబ్ దేశాల నుంచి కర్ణాటక రాష్ట్రం వచ్చినట్లు పెద్దలు చెబుతారు. అనంతరం స్వామి నెల్లూరు నగ రానికి సమీపంలోని నవలాకుల తోటలో కొంత కాలం గడిపారు. ఆ తర్వాత కసుమూరుకు వచ్చి ఒక యాదవ కుటుంబంలో పశువుల కాపరిగా ఉన్నట్లు స్థానికుల కథనం. గ్రామ సమీపంలోని చిన్న కొండపై నిత్యం ధ్యానం చేసుకుంటూ ఉండేవారు. ఎన్నో మహిమలను ప్రదర్శించేవారు. తన మహిమలను గుర్తించి కొందరు మస్తాన్‌వలికి శిష్యులయ్యారు. కొంత కాలానికి స్వామి తన శిష్యులను పిలిచి తాను సమాధి అయ్యే సమయం ఆసన్నమైందని చెప్పారు. అయితే తనకు సమాధి నిర్మించి పైకప్పు వేయకుండా తెరిచి ఉంచాలని ఆదేశించారు. ఆయన సమాధి అయిన రోజునే స్వామికి గంధమహోత్సవం నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. యాదవులు నివసించిన బంగళా నుంచి గంధాన్ని ఊరే గింపుగా తీసుకెళ్లి దర్గాకు చేర్చి, స్వామికి చదివించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ గంధాన్ని శరీరానికి పూసుకుంటే శారీరక రుగ్మతలతోపాటు ఆయురారోగ్యాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. అందుకే స్వామి గంధం స్వీకరించడానికి భక్తులు సుదూర ప్రాంతాల నుండి కసు మూరుకు తరలి వస్తారు.

● వ్యాధులను నయం చేసే షాఫాబావి

కసుమూరు - వెంకటాచలం గ్రామాల మధ్య ఉండే షాఫా బావి నీరంటే భక్తులకు ప్రగాఢమైన నమ్మకం. స్వామి బతికున్న రోజుల్లో ఈ బావిలోనే స్నానం చేసే వారని వయోవృద్ధులు చెబుతుంటారు. అందువల్ల ఈ నీటితో స్నానం చేస్తే శారీరక రుగ్మతలు నయమవుతాయని భక్తుల విశ్వాసం. అందువల్ల దర్గాకు వచ్చిన భక్తులు ఈ బావి వద్ద స్నానం ఆచరించి వెళుతుంటారు.



మస్తాన్ వలీ సమాధి



షాఫా బావి

గంధమహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు



మస్తాన్‌వలి 248వ గంధమహోత్సవం ఈనెల 18వ తేదీ గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ షరీఫ్ వెల్లడించారు. రాత్రి 12 గంటలకు మస్తాన్ స్వామి బంగళా నుంచి మొదలయ్యే గంధం ఊరేగింపు 19వ తేదీ శుక్రవారం వేకువజామున 6 గంటలకు దర్గాకు చేరుతుందని తెలిపారు. అనంతరం కడప పీఠాధిపతి ఆరిపుల్లా హుస్సేనీ స్వామికి గంధాన్ని చదివింపులు చేస్తారని తెలిపారు. ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం చిన్న గంధం (తహలీల్ ఫాతేహ) ఊ రేగింపు నిర్వహిస్తారన్నారు. ఈసారి గంధమహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఇటీవల జరిగిన సమావేశంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లు కలిసి వెల్లడించిన సంగతి విదితమే. స్థానిక సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ల సహకారంతో 248వ గంధమహోత్సవాన్ని పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఈఓ షరీఫ్ పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10413
వెండి కిలో ధర	రూ. 128300
వెండి ఒక గ్రాము	రూ. 131.30

● కసుమూరుకు ఎలా వెళ్లాలి?

నెల్లూరు నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారిపై వెంకటాచలం ఉంది. అక్కడి నుంచి 8 కిలో మీటర్ల దూరంలో కసుమూరు గ్రామం ఉంది. కసుమూ రుకు ఆర్టీసీ బస్సులను నడుపుతారు. వెంకటాచలం నుంచి ఆటోల్లో నిత్యం భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు.

● మస్తాన్‌వలి సేవలో ప్రముఖులు

కసుమూరు దర్గా అంటే ఎందరో రాజకీయ, పారిశ్రా మిక, సినీ ప్రముఖులకు మంచి నమ్మకం, గొప్ప సెంటి మెంటు కూడా ఉంది. ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ కుటుంబ సమేతంగా ఏడాదికి రెండు సార్లు దర్గాను సందర్శిస్తుంటారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ఆయన కుటుంబ సభ్యులు తప్పకుండా ప్రతి ఏటా మస్తాన్‌వలి స్వామిని దర్శించుకుంటారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, తమిళనాడు మాజీ సీఎం పన్నీరు సెల్వం, ఢిల్లీ మాజీ సీఎం సుష్మా స్వరాజ్, మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సభ్యులు, ప్రముఖ దక్షిణాది సినీ నటుడు సుమన్, సినీ సంగీత దర్శకులు కోటి, కీరవాణి, రమణ గోగుల, శివమణి ఇలా.. ఎందరో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సినీ, రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, జిల్లా రాజకీయ నాయకులు తరచుగా కసుమూరు దర్గాకు వస్తుంటారు.



గంధం బంగళా

రూ.2.5 కోట్లతో మినీ స్టేడియం నిర్మిస్తాం

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరులో రూ. 2.5 కోట్లతో మినీ స్టేడి యం నిర్మాణాన్ని చేపడుతున్నా మని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆర్‌వైఎస్ సీజన్ సిక్స్ ముత్తు కూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను, క్రీడాకారులు అక్కయ్యగారి ప్రసాద్, గుడి ప్రసాద్‌ల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. క్రీడారంగ అభివృ ద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 6 సీజన్లుగా ముత్తుకూరులో క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్స హిస్తు న్న నిర్వాహకులు రవి, ఎల్లయ్య, సుధాకర్‌లను అభినం దించారు. ముత్తుకూరులోనే రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా, మం త్రిగా వెలగబెట్టిన కాకాణి దోచు కోవడం తప్ప ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్ ఢిల్లీలో కేంద్రం కాళ్లు పట్టుకోవడం, రాష్ట్రంలో యూరియా కొరత సాకుతో ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. అనం తరం టోర్నమెంట్ స్పాన్సర్లు ఆవుల వాసు, ఈదూరు రామ్ ప్రదీప్‌రెడ్డి, రాగల శివకృష్ణ, పెదపాలెం సురేష్, సుకుమార్, డాక్టర్ హరీశ్‌లను జ్ఞాపికలతో సత్కరించారు. మైదానంలో ఎమ్మెల్యే కాసేపు క్రికెట్ ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు బొమ్మి సురేంద్ర, మునుకూరు రవికుమార్‌రెడ్డి, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మామిడాల శ్రీనివాసులు, కల్పనారెడ్డి, పోర్టు ప్రతినిధి మారుతీనందన్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

● సోమిరెడ్డిని కలిసిన కార్పొరేషన్ డైరెక్టర్లు

వెంకటాచలం : ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా వెంకటాచలం మాజీ సర్పంచ్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వలిపి మునిస్వామిని రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు నగరంలోని వేదాయపాళెంలో ఉన్న సర్వేపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వడ్డెర సంఘం నేతలతో కలిసి ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఏపీ నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియ మితులైన టీడీపీ నూర్‌బాషా సాధికారత సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ అల్తాఫ్ కూడా మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మర్యాదపూర్వ కంగా కలిసి కృతజ్ఞతలు తెలి యజేశారు.

భారతీయ జ్ఞాన వ్యవస్థ మేథో సంపదకు పునాది

వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ జ్ఞాన వ్యవస్థ వేదాలు, ఉప నిషత్తులు, ఆయుర్వేదం, యోగం, గణితం, ఖగోళ శాస్త్రం వంటి శాస్త్రాల సమాహారమని, ఇవి మన దేశ మేథోసంపదకు పునాదిగా నిలుస్తాయని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. వీఎస్‌యూలో మంగళవారం జాతీయ విద్యా విధానంలో భాగంగా భారతీయ జ్ఞాన వ్యవస్థను విద్యారంగంలో సమన్వయం చేయడమే లక్ష్యంగా ప్రత్యేక సమా వేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఈ జ్ఞానాన్ని పాఠ్యాంశాల్లో చేర్చడం వల్ల విద్యార్థులలో పరిశోధనా దృక్పథం పెరుగు తుందన్నారు. సమగ్ర విద్యాభివృద్ధికి ఎంతో దో హదపడుతుందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ కే సునీత మాట్లాడుతూ విద్యార్థులలో సమగ్ర తను, సాంస్కృతిక అవగాహనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం విద్యావేత్తలు, సాంస్కృతిక చరిత్రకారులు, ఆయుర్వేద నిపుణులు, పరి శోధకులు మార్గదర్శకాలపై చర్చించారు. కార్య క్రమంలో వర్సిటీ డీన్ ప్రొఫెసర్ సుజాఎస్ నాయర్, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ ఆర్ మధు మతి, డాక్టర్ జీ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డాక్టర్ జే విజయ, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

అధిక యూరియా వాడకంపై ర్యాలీ

మనుబోలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధిక యూరియా వాడకం వద్దంటూ మనుబోలులో వ్యవసాయాధికారులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రైతుసేవా కేంద్రం-1లో ఏడీఏ శివనాయక్ రైతులను సమావేశపరిచి అధిక యూరియా వాడితే కలిగే నష్టాలను వివరించారు. వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య, ఏపీ సీఎన్ఎఫ్ మార్కెటింగ్ శిక్షకులు వరలక్ష్మీ, ముజీర్,వీఏఏలు శివ, టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, రాయపాటి కిరణ్, మారంరెడ్డి రమణారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

పొదలకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7వ తేదీన 'చూసేదెవరు... తనిఖీ చేసేదెవరు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కథ నానికి అధికారులు స్పందిం చారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణుతి ఫ్లోరా మం గళవారం పట్టణంలోని పలు బేకరీలు, స్వీట్ షాపులు, హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వీటిలో నుంచి రెండు శాంపిల్స్ సేకరించి ఎనాలసిస్‌కు పంపినట్లు ఆమె తెలిపారు.



ఆకస్మిక తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారిణి

మత్స్యకారులకు కిసాన్ కార్డులు

మనుబోలు, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): మత్స్య కారులకు ప్రభుత్వం కిసాన్ కార్డులను త్వరలో ఇవ్వను న్నదని ఫిషరీస్ అసిస్టెంట్ కమలమ్మ తెలిపారు. స్థాని క సచివాలయం-1లో మ త్స్యకారుల నుంచి కిసాన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుబోలు మత్స్యకార సొసైటీలో 140మంది సభ్యులు ఉన్నారన్నారు. వీరందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కిసాన్‌కార్డులు పొందిన మత్స్య కారులకు బ్యాంకులు వారి నిబంధనలకు అనుగుణంగా రుణాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఈ రుణాలు మత్స్యకారులకు ఎంతగానో ఉపయో గపడాతాయన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ నాయకులు తుపాకుల చెంచురామయ్య పాల్గొన్నారు.



మత్స్యకారులకు కార్డులు అందచేస్తున్న సిబ్బంది

ఎస్సీ కార్పొరేషన్ లోన్లు ఇప్పిస్తామని మహిళలకు టోకరా

● జిల్లా ఎస్పీతో బాధిత మహిళల మొర



మాట్లాడుతున్న బాధిత మహిళలు

ఇందుకూరు పేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు గ్రూపు లోన్లు ఇప్పిస్తామని చెప్పి ఒక గ్రూపులో రూ.15 లక్షలు, మరో గ్రూపులో రూ. 10 లక్షలు కాజేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈమేరకు బాధితులు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం బాధిత మహిళలు పరుసు జయమ్మ, పరుసు భవానీ, పరుసు సుజాత, పరుసు లక్ష్మీ మీడియాతో మాట్లాడారు. ఇందుకూరుపేట మండలం చింతోపు గ్రామం అరుంధతివాడకు చెందిన పందింటి రమణయ్య అలియాస్ పోత్యం, పందింటి సుబ్బయ్య తమ గ్రామంలో పది మంది మహిళలకు గ్రూపు ద్వారా రూ.15 లక్షలు లోన్లు ఇప్పిస్తామని తమ వద్ద నుంచి ఆధార్, రేషన్, పాన్‌కార్డులు తీసుకున్నారన్నారు. లోన్ ఇప్పిస్తామని మభ్యపెట్టారని తెలిపారు. నెల్లూరులోని యూనియన్ బ్యాంకులో ఇంటి లోను కోసం మేనేజర్‌ని కలువగా మీరు మా బ్యాంక్ నుంచి గ్రూపులోను ద్వారా రూ.15 లక్షలు తీసుకున్నారని, వడ్డీతో సహా రూ.24 లక్షలు కట్టాలని బ్యాంకు వారు చెప్పారన్నారు. ఈ విషయం ఇంతవరకు తమకు తెలియదని చెప్పగా మీది స్వస్తిక్ గ్రూపు అని, మీ గ్రూపు అకౌంట్ నెంబరు 09800100020226 ఈ అకౌంట్ ద్వారా ఈ గ్రూపునకు రూ.15 లక్షలు లోను తీసుకున్నారన్నారు. మా గ్రామానికి చెందిన ఐదు మంది మహిళలు పేరు మీద ఈ లోన్లు తీసుకున్నట్లు మేనేజర్ తెలిపారు. ఈ విషయంపై రమణయ్య అలియాస్ పోత్యం, పందింటి సుబ్బయ్యను అడుగగా తాము బ్యాంకు లోన్లు కట్టామని, బ్యాంక్ మేనేజర్ డబ్బులు స్వాహా చేశాడని చెబుతున్నారన్నారు. 'మాకు సంబంధం లేదు.. మీకు దిక్కున్నచోట చెప్పుకోండి' అని బెదిరిస్తున్నారని మహిళలు తెలిపారు. తమ పేరుతో లోన్ తీసుకున్న మోసగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు కోరారు. 'నా భర్త అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. కూలికెళ్లి నేనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. మాకు న్యాయం చేయాలి' అని బాధిత మహిళ పరుసు భవానీ ఆవేదన వ్యక్తం చేసింది. 'పందింటి రమణయ్య, పందింటి సుబ్బయ్య అనే వ్యక్తులు తమ పేర్ల మీద రూ.15 లక్షలు లోను తీసుకుని మోసం చేశారని, ఇప్పుడు బ్యాంకు వాళ్లు మమ్మల్ని లోను కట్టమని ఒత్తిడి చేస్తున్నారు' అని వారు వాపోయారు. తమకు ఏ జీవనాధారమూ లేదని, తీసుకోని లోను మేమెలా కట్టాలి' అని భవానీ కన్నీటిపర్యంతమైంది.

మత్స్యకారుల మధ్య ఉద్రిక్తత



ఆందోళన చేస్తున్న స్థానిక మత్స్యకారులు

కలువాయి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం వద్ద మంగళవారం స భ్యత్వం కలిగిన మత్స్యకారులకు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన మత్స్యకారుల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక వ్యాపారులు కొందరు ఇతర జిల్లాల నుంచి మత్స్యకారులను తీసుకువచ్చి జలాశయంలో అక్రమంగా చేపలవేట సాగిస్తున్నారు. వారు జలాశయం పరిసరాల్లోనే నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్నారు. మంగళవారం స్థానిక మత్స్యకారులు ఇతర జిల్లాల మత్స్యకారులు ఉంటున్న ప్రాంతానికి వెళ్లారు. అక్కడ వారు వేటాడి ఎండబెట్టిన చేపలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు బయట ప్రాంతాల నుంచి వచ్చి, చేపపిల్లలను అక్రమంగా వేటాడి మాపొట్ట కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా బయట నుంచి వచ్చిన మత్స్యకారులు జలాశయం వదిలి వెళ్లిపోవాలని వారు హెచ్చరించారు. ఈ విషయమై మత్స్యశాఖ అధికారులకు ఎన్ని సార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జేసీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మైనింగ్ జరిగితే ప్రాణాలు వదిలేస్తాం

● అధికారులతో వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లి గ్రామస్థులు



కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈఈ అశోక్‌కుమార్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల పరిధిలో మైనింగ్ తవ్వకాలు జరిగితే ప్రాణా లు వదిలేస్తామంటూ వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు మంగళవారం అధికారులు, లీజుదారుల ఎదుట తమ గోడు వినిపించారు. వరికుంటపాడు, భాస్కరాపురం రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన సరే నంబర్లు 233, 1లోని కొండ ప్రాంతంలో మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ కొంతమంది స్థానికులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో నోటీసులు అందుకున్న కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ శాఖ ఈఈ అశోక్‌కుమార్ వివాదాస్పదంగా మారిన ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. కొండ ప్రాంతం నుంచి జంగంరెడ్డిపల్లికి చెందిన నివాసాలు కేవలం 130 మీటర్ల దూరం మాత్రమే ఉండడాన్ని గుర్తించి విస్తుపోయారు. కాగా కంపెనీ ప్రతినిధులు ముందుగానే హద్దు రాళ్లు మార్చేందుకు ప్రయత్నించడంతో విషయం తెలుసుకున్న జంగంరెడ్డిపల్లి గ్రామస్థులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాల్సిన అవసరం ఏముందంటూ నిలదీయడంతో కంపెనీ ప్రతినిధులు మౌనం వహించాల్సి వచ్చింది. సేకరించిన నివేదికలను ఉన్నతాధికారుల ద్వారా హైకోర్టుకు అందచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు దిలీప్‌కుమార్, మేధావుల ఫోరం సభ్యుడు సరాబు లక్ష్మీనారాయణ, వినియోగదారుల ఫోరం, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్, షేక్ పీరయ్య, మాజీ ఉప సర్పంచు సుంకర రాధాకృష్ణ, వార్డు సభ్యుడు నల్లగొర్ల వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు 5జీ టెలికం సేవలు

● బీఎస్ఎన్ఎల్ డీజీఎం శ్రీనివాసరావు



మిట్టా శ్రీనివాసరావు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎటువంటి టెలికం సేవలులేని మారుమూల గ్రామాల్లో సైతం 5జీ సేవలు అందించేందుకు చర్యలు తీసు కుంటున్నామని బీఎస్ఎన్ ఎల్ డిప్యూటీ జీఎం మిట్టా శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన ఆంధ్రజ్యో తితో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ డిజిటల్ ఇండియా పథకం కింద నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో 72 గ్రామాల్లో ఆరు నెలల్లో 5జీ సర్వీసుతో టెలికం సేవలు అందుతాయని తెలిపారు. ఇప్పటి వరకు 356 టవర్లు ఉండగా అదనంగా 35 టవర్లు ఏర్పాటు చేశామని, మరో 56 టవర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఫ్రీడమ్ పథకాన్ని ఈనెల 15 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్ ఉచితమని, 1నెల రీచార్జ్ కేవలం ఒక్క రూపాయితో చేసుకుంటే 30 రోజులు 2జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజూ 100 ఎస్ఎంఎస్‌లు పొంద వచ్చని తెలిపారు. ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వినియోగదా రులు అదనంగా రూ.140 చెల్లిస్తే ఇంటర్నెట్‌తోపాటు సినిమా చానల్స్ చూసి ఆనందించే అవకాశం కల్పించామని తెలిపారు. వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258

కోడిగుడ్ల ధర (100): 545

ఎరువుల పేరుతో వైసీపీ డ్రామాలాడుతోంది : ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత పేరుతో వైసీపీ డ్రామాలు వేస్తోందని సర్వేపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో మీకే మామద్దతంటూ ఢిల్లీలో కాళ్లబేరం ఆడుతూ ఏపీలో మాత్రం నిరసనల పేరుతో వీధుల్లో నాటకాలాడుతోందని ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా యూరియా కొరత సమస్యగా మారిందని, అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ 50వేల టన్నులు ఏపీకి కేటాయించేలా చర్యలు తీసుకున్నారని కొనియాడారు. వైసీపీ హయాంలో వ్యవసాయశాఖను పూర్తిగా పక్కన పెట్టేశారని తెలిపారు. ఎరువులు, పురుగు మందుల నుంచి సూక్ష్మపోషకాలు, బిందు సేద్యం, యాంత్రీకరణ అన్నీ మూలకు నెట్టేశారని ఆరోపించారు. ఇప్పుడేమో ధర్నాలు చేస్తూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని, వైసీపీ చేష్టలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా డ్రామాలు ఆపాలని హితవు పలికారు.

న్యూస్ బాక్స్

'బొల్లినేని' విద్యార్థినికి బంగారు పతకం



బంగారు పతకం అందుకున్న గోపీచందన

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బొల్లినేని నర్సింగ్ కళాశాల ఎంఎస్సీ నర్సింగ్ విద్యార్థిని పాలవలస గోపీ చందనకు బంగారు పతకం లభించింది. మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చదలవాడ శ్రీలక్ష్మీ మెమోరియల్ స్వర్ణ పతకాన్ని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ అందచేశారు. తమ కళాశాల విద్యార్థిని విశ్వవిద్యాలయం ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించడం గర్వంగా ఉందని కళాశాల సీఈవో టీ గిరి నాయుడు తెలిపారు. కాగా, విద్యార్థిని గోపీ చందనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, టీ శివమాల, అధ్యాపకులు అభినందించారు.

సైబర్ ఆర్థిక మోసాల నివారణకు మార్గాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ప్రజలను భయపెడుతున్న సైబర్ నేరాలను నివారించేందుకు తాము కొన్ని మార్గాలను సూచనల రూపంలో రిజర్వు బ్యాంకుకు పంపామని ఎ ట్రస్ట్ ఫర్ ఆల్ సంస్థ నిర్వాహకుడు అళహరి వెంకటేష్, ముత్యాల రవీంద్ర, తోట శ్రీమంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. తాము పంపిన సూచనలు రిజర్వ్ బ్యాంకు పరిశీలించి, బ్యాంకులు, పోస్టాఫీసులకు దిశా నిర్దేశం చేస్తే సైబర్ నేరాల నుంచి బాధితులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు.

13న అంబేడ్కర్ సిద్ధాంత అధ్యయన తరగతులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ ధర్మపోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న బాబా సాహెబ్ అంబేడ్కర్ సిద్ధాంత అధ్యయన తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంగిలాల రామచంద్రరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రకాశం జిల్లా కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతుందని తెలిపారు. అంబేడ్కర్ అభిమానులు అందరూ తరలిరావాలని కోరారు.

కోతలు లేకుండా ఆపరేషన్

● డాక్టర్ అర్జున్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో ఫైబ్రాయిడ్స్, పురుషుల్లో ప్రోస్టేట్ గ్లాండ్ వాపు వంటి వివిధ వ్యాధులకు కోతలు లేకుండా ఆపరేషన్ చేయటం రివా వేస్కులర్ ఇన్‌స్టిట్యూట్ ప్రత్యేకత అని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తనయుడు డాక్టర్ అర్జున్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం రాత్రి వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నెల్లూరు, కావలి బ్రాంచిల ఆధ్వర్యంలో జరిగిన వైద్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం చాలా చోట్ల కోతలు పెడుతూ వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వాటన్నిటికి భిన్నంగా చిన్న పిన్ సైజు హోల్ ద్వారా చికిత్స ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు తమ జీవితకాలంలో 60 శాతం ఫైబ్రాయిడ్ వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో ఇలాంటి వ్యాధులకు సర్జరీలు చేసేవారని ఇకపై అలా లేకుండా కేవలం చిన్న సైజు హోల్ ద్వారా చికిత్స చేస్తామన్నారు. ఇలాంటి చికిత్స వల్ల రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉందని చెప్పారు. అడ్వాన్స్ వరల్డ్ క్లాస్ ఫుడ్ కేర్ ట్రీట్‌మెంట్ రివా ఇన్స్టిట్యూట్‌లో అందిస్తున్నామన్నారు. డాక్టర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ దేహంలో ఎలాంటి సర్జరీలు లేకుండా మూసుకుపోయిన రక్తనాళాలను సరిచేసి రక్త సరఫరాను మెరుగు పరచటమే ఈ ఇన్స్టిట్యూట్ లక్ష్యమని తెలిపారు. దేశంలో ఏడాదికి 20 లక్షల మందికి డయాబిటిస్ కారణంగా కాళ్లు తొలగించాల్సి వస్తుందని చెప్పారు. అందులో మార్పు తీసుకువచ్చే విధంగా వేస్కులర్ సర్జరీలు చేస్తామని పేర్కొన్నారు. గుండెకు రక్తం సరఫరా చేసే రక్తనాళాలు మూసుకు పోయినా తగిన చికిత్స ద్వారా సరి చేయవచ్చని వెల్లడించారు.


మాట్లాడుతున్న డాక్టర్ అర్జున్ రెడ్డి

నేత్రదానంపై చైతన్యం రావాలి

● నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నేత్రదానంపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణ కళాశాలలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా డ్రాయింగ్, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నారాయణ వైద్య కళాశాల, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పక్షోత్సవాలు ఘనంగా జరిగాయని చెప్పారు. నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు. నారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దొరసానమ్మ మాట్లాడుతూ నేత్రదానంపై సమాజంలో మార్పు తీసుకువచ్చే విధంగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కంటి విభాగం అధిపతి డాక్టర్ విజయలక్ష్మి, నారాయణ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కార్తీక్, నారాయణ నర్సింగ్ రీసెర్చ్ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రతిమ, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న వైద్యులు

● నేత్ర సేకరణకు రూ.1.93 లక్షల విరాళం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కి నెల్లూరు నేత్ర దాతల సంస్థ నుంచి రూ1.93 లక్షలు అందజేశామని నెల్లూరు నేత్రదాతల సంఘం కార్యదర్శి తిక్కవరపు సుకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేత్రదాతల సభ్యత్వ మొత్తం బ్యాంకులో డిపాజిట్ చేసినందున వడ్డీ రూపంలో అదనంగా వచ్చిందన్నారు. తమ సంస్థ నేత్రాల సేకరణలో ఖర్చులు పొదుపు చేయడం ద్వారా ఈ మొత్తం లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు మన్నేపల్లి గిరిజ, ఉపాధ్యక్షుడు అన్నదాత వెంకట సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఆనంద రామ్‌సింగ్, కార్యనిర్వాహక సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భౌ..భౌ..!

● భయపెడుతున్న వీధి కుక్కలు
● నగరంలో విచ్చలవిడిగా మందలు
● చిన్నారులు, వృద్ధులపై దాడి
● ద్విచక్ర వాహనాల వెంటబడుతున్న శునకాలు



నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రధాన కూడళ్లు, రహదారులతోపాటు వీధుల్లోనూ మందలుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఒంటరిగా వెళ్లే పాదచారులు, పిల్లలు, వృద్ధులపైకి దూకుతు న్నాయి. ద్విచక్ర వాహన దారుల వెంటబడుతు న్నాయి. ఏబీసీ (సంతా నోత్పత్తి నివారణ) చికిత్సలు చేయిస్తున్నప్పటికీ కుక్కల గుంపులు పెరుగుతూనే ఉండటం ఆందోళనకరంగా మారింది. అయితే వీధి కుక్కలను నిర్మూలించే అధికారం ఎవరికీ లేదు. వాటి సంతానోత్పత్తిని మాత్రమే నివారించగలం. ఆ దిశగా నగర పాలక సంస్థ కృషి చేస్తోంది. దొరికిన కుక్కను దొరికినట్లు ఏబీసీ కేంద్రానికి తరలించి చికిత్స చేసి వదులుతున్నారు. అయినా వాటి సంఖ్య పెరుగుతూనే ఉంది. చెత్తకుప్పల వద్ద స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్న శునకాలు పరస్పరం గొడవపడి ఇళ్లలోకి చొరబడుతు న్నాయి. చెత్త వేసేందుకు కుండీల వద్దకు వెళితే మీదపడుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

శివార్లలో అత్యధికం

నగరానికి శివారునున్న ప్రాంతాలలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. ఈ ప్రాంతాలకు అతి సమీపాన రూరల్‌లోని గ్రామాలుండటంతో అక్కడ్నుంచి కుక్కలు శివారు ప్రాంతాలకు చేరుతున్నాయి. ఇక్కడి చెత్త కుప్పల వద్ద ఆహారం లభిస్తుండటంతో ఇక్కడకు వచ్చిన కుక్కలు తిరిగి వెళ్లడంలేదని స్థానికులు చెబు తున్నారు. ఇలా కరిచే కుక్కలను గుర్తించి కార్పొరేషన్ సిబ్బంది పట్టుకెళ్లి ఏబీసీ కేంద్రం లో చికిత్స తర్వాత మళ్లీ వీధుల్లో వదిలేస్తు న్నారని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

సంతానోత్పత్తిని గణనీయంగా తగ్గించాం



నగరంలో వీధి కుక్కల నియంత్రణకు సంతానోత్పత్తి లేకుండా చేస్తున్నాము. మా లెక్కల ప్రకారం 31 వేల కుక్కలు నగరంలో ఉన్నాయి. వాటిలో సుమారు 24 వేల శునకాలకు సంతానం కలుగకుండా చికిత్స చేశాము. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా కరిచే కుక్కలను కూడా తీసుకెళ్లి మా పర్యవేక్షణలో పెడుతున్నాము. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించాము. పట్టుకున్న ప్రతీ కుక్కకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయిస్తున్నాము.
- మదన్‌మోహన్, కార్పొరేషన్ వెటర్నరీ వైద్యుడు

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టౌనుహాలులో బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం జరిగింది. బోధనాపరంగా విశేషంగా కృషి చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు కబీర్, స్కూల్ వర్క్, కంప్యూటర్ వర్క్‌తోపాటు విద్యార్థులకు ఉత్తమ బోధన చేస్తున్న గాయత్రి తదితరులు ఈ సన్మానం పొందారు. ఈ కార్యక్రమంలో సాహితీకారుడు గంగిశెట్టి శివకుమార్, ఎంఈవో కే మల్లికార్జున్ రావు, కో ఆర్డినేటర్‌గా రామమోహన్, తదితరులు పాల్గొన్నారు. బాలభవన్‌ల డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి పర్యవేక్షించారు.

● పురమందిరంలో మంగళవారం జీవన యోగశాల ఆరోగ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో 21 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి రామాయణం మహేశ్వరస్వామి అధ్యక్షత వహించారు. జీవన యోగ ఆరోగ్య ట్రస్ట్ చైర్మన్ పీవీ ప్రసన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ పాఠశాలలకు చెందిన 21 మంది ఉపాధ్యాయులను ట్రస్ట్ తరపున సెట్నెల్ సీఈవో అంచనాల నాగేశ్వరరావు, రచయితల సంఘం అధ్యక్షుడు ఏ జయప్రకాష్, యోగాలయ డైరెక్టర్ జేకే స్వప్న, స్వయంప్రభ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారులు నృత్య ప్రదర్శనలు అలరించాయి.


బాలభవన్ సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో నిర్వాహకులు

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికుల సమస్యలు మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కష్టం వస్తే అర్ధరాత్రి అయినా వస్తానని వెల్లడించారు. మంగళవారం నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద టీఎన్‌టీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. క్రమశిక్షణకు మారుపేరు టీఎన్‌టీయూసీ అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తొలుత ఆటో కార్మికులే టీడీపీలో చేరారని, ఆ తర్వాత ప్రవాహంలా పార్టీలోకి చేరికలు జరిగా యని చెప్పారు. ఐలవ్ నెల్లూరు అనే స్టిక్కర్‌ను ప్రతీ ఆటోకు అతికించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ, సుజన్, సుకుమార్, ఆకుల హనుమంత రావు, వెంగయ్య, ప్రసన్నకుమార్, మల్లికార్జున పాల్గొన్నారు.


టీఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరణలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

ఉత్సాహంగా 5కే రన్

హెచ్‌ఐవీపై అవగాహన దిశగా మారథాన్

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హెచ్ ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ, స్పోర్ట్స్ అథారిటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో 5కే రన్ జరిగింది. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద ఈ మారథాన్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత జెండా ఊపి ప్రారంభించారు. ఈ పరుగు కరంటాఫీసు సెంటర్ మీదుగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంకు చేరుకుంది. ఇందులో 17 నుంచి 25 ఏళ్ల యువతీ యువకులు, ట్రాన్స్‌జెండర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సుఖ వ్యాధులపై అందరూ అవగాహన కలిగి ఉండాల న్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ ర్యాలీ, క్విజ్, అవగాహన తరగతుల ద్వారా హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం మారథాన్ విజేతలకు బహుమతులు అందచేశారు.


5 కే రన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

ఉత్తమ అధ్యాపకురాలికి సన్మానం


అధ్యాపకురాలు వింధ్యావళిని సత్కరిస్తున్న డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలు డాక్టర్ ఎస్ వింధ్యావళి సేవలు అభినందనీయమని నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి అన్నారు. ఆ కళాశాలలో మంగళవారం ఆంగ్ల అధ్యాపకురాలు వింధ్యావళి అభినందన కార్యక్రమం జరిగింది. విద్యార్థుల ఉన్నతికి ఆమె అందిస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఉత్తమ అధ్యాపకురాలి పురస్కారం అందించడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆమె స్ఫూర్తితో అధ్యాపకులం దరూ ఉత్తమ సేవ లందించాలని కోరారు.

బీజేపీలో చేరిక

కందుకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం మండలం వెంగళాపురానికి చెందిన రాతికింది వేణు, రాతికింది కొండమ్మ లు మంగళవారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల రాఘవయ్య, జగన్నాథం వైకుంఠం, ముప్పల భూషయ్య, మట్టె ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాలో జాగ్రత్తలు తీసుకోండి

● లేకపోతే జరిమానా : కమిషనర్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఇసుక రవాణాదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే జరిమానా విధిస్తామని కార్పొరేషన్ కమిషనర్ నందన్ హెచ్చరించారు. మంగళవారం పొట్టేపాళెం రీచ్ నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, ఇతర వాహనాలను ఆయన ఆపి మాట్లాడారు. ఇసుక రవాణా చేసే సమయంలో కచ్చితంగా పైన పట్ట కప్పాలని సూచించారు. దీని వల్ల ఇసుక రోడ్లపై పడకుండా ఉంటుందని తెలిపారు. దీనిని అనుసరించకపోతే జరిమానా తప్పదన్నారు. అనంతరం 17వ డివిజన్ అయోధ్యనగర్, నక్కలవాళ్ల కూడలి ప్రాంతాల్లో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై పరిశీలన జరిపారు. రెవెన్యూ విభాగంపై వారాంతపు సమీక్ష నిర్వహించారు.


ఇసుక రవాణాదారులతో మాట్లాడుతున్న కమిషనర్

'హంస' నగర కమిటీ ఎన్నిక

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్ ఆధ్వర్యంలో నెల్లూరు సిటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌస్‌బాషా, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా మజరి, కోశాధికారిగా ఉమామహేశ్వరి, కార్యనిర్వాహక కార్యదర్శిగా అమరావతి, మహిళా వింగ్ కార్యదర్శిగా వింధ్యవల్లి, పబ్లిసిటీ కార్యదర్శిగా సోమనాథ్, ఉపాధ్యక్షులుగా ఐదుగురు, అదనపు కార్యదర్శులుగా మరో 5 మందిని ఎంపిక చేశారు. ఎన్నికల అధికారులుగా జలీల్ అహ్మద్, నాగరాజు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మార్క్, పృథ్వీరాజ్, బ్రహేశ్వరి, అనికుమారి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హంస నగర కమిటీకి ఎన్నికైన వారు

యూరియా వాడకం పెరిగితే అనర్థాలు

● వ్యవసాయ అధికారులు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరి సాగులో యూరియాను ఎక్కువగా వాడితే అనర్థమని వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి, ఏవో నాగమోహన్ రైతులకు సూచించారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని కోరుతూ మంగళవారం కొండ్లపూడి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఎకరా వరి పంటకు రెండు లేదా మూడు బస్తాల యూరియా మాత్రమే సరిపోతుందని స్పష్టం చేశారు. అంతకుమించి వాడితే భూమి సారాన్ని కోల్పోతుందని తెలియజేశారు. పచ్చిరొట్ట ఎరువులు వేయడం వల్ల భూమిలో సారం పెరిగి దిగుబడులు ఆశించినంతగా వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీగా వెళ్తున్న వ్యవసాయ అధికారులు

రోడ్డు మధ్య వాహనాలు ఆపితే సహించం

● పప్పులవీధిలో నవాబుపేట సీఐ హెచ్చరికలు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని పప్పులవీధిలో రోడ్డు మధ్య వాహనాలు ఆపితే సహించేది లేదని నవాబుపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపా ల్‌రెడ్డి హెచ్చరించారు. ఆ వీధిలో వాహన చోదకులు, ప్రజలు పడుతున్న ట్రాఫిక్ కష్టాలపై 'మా ఇష్టం... అడిగేది ఎవరు' శీర్షికన ఆంధ్రజ్యోతి మంగళవారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. మంగళవారం పప్పుల వీధిలో పర్యటించారు. ఆంధ్రజ్యోతి కథనం నిజం అన్నట్లుగా వరుసగా లారీలు ఆగి ఉండటం, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటాన్ని గుర్తించారు. వాహనాలు తీయాలని లారీ డ్రైవర్లకు సూచించారు. వారు స్పందించక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతీ రోజూ పప్పులవీధి ప్రాంతంలో తనిఖీలు చేస్తామని, భారీ వాహనాలు రోడ్డుకు అడ్డంగా ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీంతో మంగళవారం పప్పువీధిలో వాహ నరాకపోలు సాఫీగా సాగాయి.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రోడ్డుపై అడ్డంగా నిలిపిన లారీని తీయాలని డ్రైవర్‌ను ఆదేశిస్తున్న సీఐ వేణుగోపాల్ రెడ్డి

హలో.. హలో.. వినిపిస్తోందా...?



వలేటివారిపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నుంచి సేవలు నిలిచిపోయి నిరుపయోగంగా మారింది. కరెంట్ పోతే చాలు బీఎస్ఎన్ఎల్ ఫోన్లు పనిచేయడం లేదు. ప్రభుత్వ అధికారిక సిమ్‌లు అధికంగా బీఎస్ఎన్ఎల్‌వే ఉండడంతో సమాచారం ఉన్నతాధికారులకు చేరవేయడానికి, మాట్లాడేందుకు అవస్థలు పడుతున్నారు. ఫోన్ చేస్తే హలో.. హలో.. వినిపిస్తోందా అనుకుంటుండ గానే కాల్ కట్ అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలను పునరుద్ధరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

జడ్పీ పాఠశాలలో డిజిటల్ అవగాహన

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా బ్యాంకులకు సంబంధించిన నగదు నిర్వహణ, బ్యాంకులు అందించే సేవలు, విధివిధానాలు, డిజిటల్ లావా దేవీలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్‌బ్యాంక్ జీఎం ఆర్కే మెహ తా, ఏజీఎం రాజేష్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, లీడ్ బ్యాంక్, కెనరా బ్యాంక్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, రీల్స్ పోటీలకు
ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక దినోత్సవం-2025 సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫొటోగ్రఫీ పోటీలు, రీల్స్, వీడియోల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వ కోటలు, జలపాతాలు, ఎకో టూరిజం, స్థానిక వంటకాలు వంటి అంశాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులు, ఫొటోగ్రాఫర్లు, సృజనాత్మక ప్రతిభ కలిగిన వారు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9493668022, 7780749802 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'కానగ చెట్టు' కాలనీకి
వెళ్లొద్దాం రండి..!

రోడ్డుకిరువైపులా కానగ చెట్లు... అందుకే ఆ పేరు

కొన్ని ఊర్ల పేర్లు చాలా ఆశ్చర్యంగా ఉంటాయి. మరికొన్ని విచిత్రంగా ముచ్చటగొలిపేలా ఉంటాయి. ఆ పేర్ల వెనుక అంతులేని చరిత్ర కూడా ఉండొచ్చు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతను బట్టి స్థల నామాలు ఏర్పడతాయి. కాలక్రమంలో స్థానికంగా ప్రముఖ వ్యక్తులు... లేదా ప్రకృతి, ఆధ్యాత్మిక విశిష్టతలను బట్టి కూడా కొన్ని ఊర్ల పేర్లు ఏర్పడి ఉంటాయి. బుచ్చి-జొన్నవాడ మార్గంలోని చెల్లాయపాళెం పంచాయతీ వడ్డిపాళెంకు సమీపంలోని ప్రధాన రహదారిలో చెట్టు పేరుతో ఓ గ్రామం ఉంది. దాని పేరు 'కానగ చెట్టు' కాలనీ. 50 ఏళ్ళ క్రితం 25 గిరిజన కుటుంబాలు ఇక్కడ నివసించేవి. వీరి ఇళ్లు ఉన్న ప్రాంతంలో ప్రధాన రహదారికి ఇరువైపులా వరుసగా కానగ చెట్లు వుండేవి. పరిణామ క్రమంలో ఈ ప్రాంతం రెవెన్యూ రికార్డుల్లో సైతం 'కానగచెట్టు కాలనీ'గా నమోదు కావడం గమనార్హం. అప్పట్లో రోడ్డుకు పడమటి వైపు ఇటుక బట్టీలుండేవి. ఇటుక బట్టీలు, వ్యవసాయ పనులే ఈ కాలనీ గిరిజనుల జీవనాధారం. చేసుకుంటూ కుటుంబాలు పోషించుకునేవారు. క్రమక్రమంగా పలు సామాజిక వర్గాలకు చెందిన 70కి పైగా కుటుంబాలు ఇక్కడ నివాసం ఏర్పరచు కున్నాయి. ప్రస్తుతం కానుగచెట్టు కాలనీలో సుమారు 200కు పైగా జనాభా ఉంది. 130 నుంచి 150 మంది వరకు ఓటర్లు ఉన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)





అల్లూరులో వరికోత యంత్రాల
సందడి

వరికోతలు ముమ్మరమైన నేపథ్యం లో వందల సంఖ్యలో వరికోత యంత్రాలు అల్లూరు మండలానికి తరలి వచ్చాయి. ఈ క్రమంలో ప్రతి రోజూ ఉదయాన్నే స్థానిక పెట్రోలు బంకుల వద్ద బారులు తీరి డీజిల్ నింపుకొంటున్నాయి. మంగళవారం పెట్రోల్ బంకు వద్దకు వచ్చి ఆ ప్రాంతమంతా లారీల్లో ఎక్కిన వరికోత యంత్రాలతో వాటి నిర్వాహకులు, కూలీలు, రైతులతో సందడి నెలకొంది.

- అల్లూరు,(ఆంధ్రజ్యోతి)



సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారమా?

ఒక్కక్షణం ఆలోచించండి

పోరాడి విజేతలుగా నిలవండి

నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

కుటుంబ కలహాలు, వేధింపులు, ఆర్థిక ఇబ్బందులు, పరీక్షల్లో ఫెయిల్ అయ్యారనో, ప్రేమ విఫలం అయ్యిందనో క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడేవారు నేటి సమాజంలో ఎక్కువవుతున్నారు. ఓ ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబ పరిస్థితి తలకిందులవుతుంది. అలాగే, ఇంటి ఇల్లాలు ఆత్మహత్య చేసుకుంటే పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుంది. చేతికి అందివచ్చిన కొడుకో.. కూతురో బలవన్మరణానికి పాల్పడితే ఆ తల్లిదండ్రుల వేదన ఎవరూ తీర్చలేనిది. ప్రపంచంలో సమస్యలే లేనివారు ఉండరనేది వాస్తవం. అలాగే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందనేది సత్యం. కొంచెం సహనంతో ఆలోచిస్తే, పెద్దల సలహాలు తీసుకుంటే మన సమస్యకు తప్పక పరిష్కారం లభిస్తుందనే విషయాన్ని గుర్తించాలి. అంతేకానీ మరణమనే మార్గాన్ని ఎంచుకుంటే మిగిలేది రోదనే అని గ్రహించాలి.

ఇలా ఎదుర్కోవాలి



ధైర్యం, ఆత్మవిశ్వాసం, మంచి ఆలోచనలు, భవిష్యత్‌ను చక్కగా ఊహించుకోవాలి. ఆత్మహత్య బావన ఉన్నవారు చావు గురించి మాట్లాడటం, డైరీ, ఇతర పుస్తకాల్లో ఎలా చావాలో వంటి అంశాలను రాస్తుంటారు. వాటిని గమనిస్తూ ఉండాలి. అలాంటి వారిని ఒంటరిగా ఉంచకూడదు. వీలైనంత వరకు ఇంట్లో వారందరి మధ్య ఉంచుతూ అందరూ కలిసి వారిలో ధైర్యం నింపాలి. ఆత్మహత్యకు సహకరించే వస్తువులను అందుబాటులో లేకుండా చూడాలి. పాజిటివ్ థింకింగ్ పుస్తకాలు, బిహేవియర్ థెరపీ, కౌన్సెలింగ్ వంటివి శక్తివంతంగా ఉపయోగపడతాయి.

- డాక్టర్ సురేష్‌బాబు, మానసిక వైద్యనిపుణుడు

మరణమే మార్గమా..!?

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న కారణాలతో, ఆలోచనారహితంగా కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వీటికి ప్రధాన కారణాల్లో ఒకటి ఒత్తిడికాగా మరొకటి ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడమనేది నిపుణుల విశ్లేషణ. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు ఒకరి బాధలను మరొకరితో పంచుకునే వారు. దీంతో సమస్యలకు పరిష్కా రం లభించేది. కానీ, ఇప్పటి రోజుల్లో ఇంట్లో భార్య, భర్త, పిల్లలు మాత్రమే ఉంటున్నారు. ఆ నలుగురు కూడా రోజు మొత్తం మీద కలిసి ఉండే సమయం అతి తక్కువ. ఉన్న కాసేపు కూడా సెల్‌ఫోన్‌తోనే గడిపేస్తున్నారు. ఈ క్రమంలో వారి మధ్య మనస్పర్థలు వస్తే చెప్పుకోవడానికి మరో మనిషి లేక, ఇతరులకు చెప్పుకోలేక కుంగిపోతూ ఆత్మహత్య వైపు అడుగులు వేస్తున్నారు. దీనివల్ల ఆ కుటుంబం ఎంతో నష్టపోతోంది. సమస్యలను సంప్రదింపులతో సామరస్యంగా పరిష్కరించుకోవాలి. వీలుకాకపోతే పోరాడి సాధించుకోవాలేగానీ ప్రాణాలను విడవాలనుకోవడం సరైన నిర్ణయం కాదు. మన రాజ్యాంగం జీవించే హక్కు కల్పించింది. దీనిని ఉల్లంఘిస్తూ ఆత్మహత్యకు యత్నించిన వారు సెక్షన్ 309 ప్రకారం శిక్షార్హులవుతారని గుర్తించాలి.

ఇటీవల కాలంలో వరుస ఆత్మహత్యలు

- నెల్లూరులోని డైకస్‌రోడ్డు ఎన్‌సీసీ కాలనీలో భార్యాభర్తల మధ్య వివాదంతో మస్తానయ్య(36) అనే వ్యక్తి ఈ నెల 3వతేదీ ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి 18 నెలల పాప ఉంది.
- రిత్విక్‌ఎన్‌క్లేవ్ సమీపంలో నివసించే షేక్ రసూల్(23) మద్యానికి బానిసై ఆ మత్తులో పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ క్రమంలో గత నెల 30న ఇంట్లో ఉరి వేసుకుని మరణించాడు.
- నేపాల్ దేశం నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చిన కార్మికుడు భికాష్(25) మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై ఫోన్‌లో తల్లిదండ్రులు మందలించారు. భార్య సైతం మద్యం అలవాటు మానుకోవా లని చెప్పడంతో మనస్తాపం చెందిన భికాష్ గత నెల 24న ఉరేసుకుని మృతి చెందాడు.

జిల్లాలో ఏటా ఆత్మహత్యలు ఇలా...

సంవత్సరం	పురుషులు	మహిళలు	మొత్తం
2022	274	96	370
2023	333	99	432
2024	292	90	382
	899	285	1184

చిన్నారులకు సాయం కోసం సీఎంను కలిసిన ఎమ్మెల్యే కాకర్ల

- ఒక్కొక్కరికి రూ.2 లక్షలు ప్రకటించిన చంద్రబాబు



ఉదయగిరి, సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి): మండలంలోని అప్పసముద్రంలో వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదవశాత్తు బాణసంచా పేలి చిన్నారులకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఆ చిన్నారులకు ఆర్థికసాయం చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సీఎం నారా చంద్రబాబునాయుడును మంగళవారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా ప్రమాద సంఘటనపై సీఎంకు ఎమ్మెల్యే వివరించారు. చలించిన ఆయన ఒక్కో చిన్నారికి రూ.2 లక్షల చొప్పున 9 మంది చిన్నారులకు రూ.18 లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికసాయాన్ని క్షతగాత్రుల ఇంటికెళ్లి అందజేస్తామన్నారు. అలాగే ప్లాస్టిక్ సర్జరీ అవసరమైన చిన్నారులకు వైద్యుడు రవి వైద్యం చేసేందుకు ముందుకొచ్చారన్నారు.

నేతల హర్షం

చిన్నారులకు సీఎం చంద్రబాబు ఆర్థికసాయం మంజూరు చేయడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ. చెంచలబాబుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ సీహెచ్ బయ్యన్న, మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు, పార్టీ నాయకుడు తుమ్మల కిరణ్‌బాబులు ఓ సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేద్దాం

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

వెంకటాచలం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద గల ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో గిడుగు వేంకటరామమూర్తి, కాళోజీ నారాయణ రావు జయంత్యుత్సవాల సందర్భంగా 'తెలుగు భాషా పరిణామంలో మైలురాళ్ళు' అనే అంశంపై మంగళవారం జాతీయ సదస్సు నిర్వహించారు. తొలిరోజు ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరై సదస్సును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం మైసూరులో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రత్యేక చొరవతో సర్వేపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలుగు భాషాభివృద్ధికి అవసరమైన శిక్షణ కార్యక్ర మాలు చేపట్టాలన్నారు. భాషాభివృద్ధికి చేసే ప్రతి కార్యక్రమంలో తనవంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ మాతృభాషా మాధ్యమంలో విద్యాబోధన వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మైసూరు విశ్వ విద్యాలయ ఆచార్యులు ఆర్‌వీఎస్ సుందరం మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఆయా దేశాలు మాతృభాషలో విద్యా బోధనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఈ కేంద్రానికి స్వయం ప్రతిపత్తి ఎంతో అవసమని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం, భాషావేత్తలు సమి ష్టిగా కృషి చేయాలన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఈ కేంద్రం అభివృద్ధికి స్వయం ప్రతిపత్తి ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. సదస్సుకు డాక్టర్ ఎల్ఆర్ ప్రేమ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్ర మంలో డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి, ప్రముఖ భాషావేత్త ఆచార్య జీ ఉమమహే శ్వరరావు, భక్తవత్సలరెడ్డి, శ్యామల పాల్గొన్నారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలు తీవ్ర పని ఒత్తిడి గురవుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మిని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కలిసిన వారు వీఆర్వోల సమస్యలను ఆమెకు వివరించారు. కాగా, వెంటనే 15 రోజుల సర్వే ట్రైనింగ్ చేపట్టి, పరీక్షలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలిచ్చారని వారు తెలిపారు.



బంతిపూలు కోస్తున్న కూలీలు



బంతిపూల ధర పతనమైంది. మార్కెట్‌లో కేజీ రూ.5కు కూడా వ్యాపారులు అడగడం లేదని రైతులు వాపోతున్నారు. కోత కూలి, రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో తోటల్లో కోతకు వచ్చిన పూలను ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు పడిపోయారు. కోతకు వచ్చిన పూలు కోయకపోతే తరువాత కోతలు సక్రమంగా రావని వారు వాపోతున్నారు. మార్కెట్‌లో అడిగేవారు లేకున్నా కొందరు రైతులు పూలు కోసి తోటల్లో గుట్టలు పోస్తున్నారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

సువాసన తగ్గిన
బంతిపూలు

- మార్కెటలో ధర పతనం
- కేజీ పూలు రూ.5
- ఆందోళనలో సాగుదారులు

కలువాయి మండలంలో ఈ ఏడాది కలువాయి, కొలవపల్లి, తోపుగుంటలో గ్రామాల్లో సుమారు 15ఏకరాల్లో బంతిపూల తోటలు సాగు చేశారు. ఎకరాకు రూ. 60 నుంచి రూ. 70వేలు ఖర్చు చేసి తోటలు సాగు చేశారు. ఈ ఏడాది పైరుకు తెగుళ్ల ఎక్కువగా ఆశించడంతో పురుగుమందులకు కూడా భారీగానే ఖర్చు చేశారు. వినాయక చవితి సమయంలో కేజీ పూలు రూ.50 నుంచి రూ.60ల వరకు పలికింది. ఆ సమయంలో పెద్దగా పూల దిగుబడి లేదు. ఈ ధర మార్కెట్‌లో కొంతకాలం కొనసాగితే నాలుగు రూపాయిలు చేతికి వస్తాయని రైతులు ఆశ పడ్డారు. కాగా వినాయక చవితి అనంతరం మార్కెట్‌లో పూల ధర పతనమైంది. ఇదే సమయంలో తోటలలో పూల దిగుబడి కూడా పెరిగింది. కోతకు వచ్చిన పూలను అడిగే వ్యాపారులు లేక రైతులు లబోదిబోమంటున్నారు.

తీవ్రంగా నష్టపోయాం..



మార్కెట్‌లో ధర పూర్తిగా పతనం కావడంతో ఈ ఏడాది బంతి పూలు సాగు చేసి మేం తీవ్రంగా నష్టపోయాం. కనీసం సాగు ఖర్చులు కూడా చేతికి అందే పరిస్థితి లేదు. తెగుళ్ల దాటికి సాగు ఖర్చులు కూడా రెండింతలైంది.

- ఇమ్మరాజు పెంచలయ్య, రైతు, కొలవపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది బంతి పూలు సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని ఆశ పడి సాగు చేశాం. ఇంత ఘోరంగా ధర పడిపోతుందని కలలో కూడా ఊహించలేదు.

- ఎన్.కార్తీక్, రైతు, కొలవపల్లి

ఈ-క్రాప్ నమోదు అయితేనే
యూరియా

- సమస్యను అధిగమించేందుకు టోల్‌ఫ్రీ నంబరు
- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

ఉదయగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే రైతులకు యూరియా అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి పుట్టా సత్యవాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లాలో యూరియా అధిక వినియోగం వల్ల వచ్చే అనర్థాలను వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు వివరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలు అక్టోబరు 31 వరకు కొనసాగుతాయన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో యూరియా కావాల్సిన రైతులు కచ్చితంగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడవద్దని, అవసరమైన రైతులకు తప్పనిసరిగా యూరియా అందజేస్తామన్నారు. సోమవారం ఉదయగిరిలో చేపట్టిన యూరియా పంపిణీలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, భవిష్యత్తులో అవి తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఉదయగిరి సబ్ డివిజన్‌కు అవసరమైన యూరియాను త్వరలో పంపిణీ చేస్తామన్నారు. రైతులు యూరియా సమస్యను అధిగమించేందుకు 83310 57285 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన రైతులు సంబంధిత వ్యవసాయ కార్యాలయాన్ని లేదా టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలన్నారు. తొలుత గుడినరవ రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఏడీఏ లక్ష్మీమాధవి డిప్యూటేషన్‌పై కడపకు బదిలీపై వెళ్లడంతో ఆమెను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, చెన్నారెడ్డి, ఏవోలు సునీల్, మదన్, విజయభాస్కర్, ఏఈవోలు భోగ్యం సుధీర్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఏడీఏ లక్ష్మీ మాధవిని సన్మానిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి, అధికారులు



పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌ను విచారిస్తున్న ఎంపీడీవో భవానీ

నిధుల స్వాహాపై ఎంపీడీవో విచారణ

కలువాయి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలువాయి మేజర్ పంచాయతీలో జూనియర్ సహాయకుడి కుమారుడు పెత్తనం, డూప్లికేట్ రసీదు పుస్తకాలతో ఇంటి పన్నులు వసూలు చేసి పెద్ద మొత్తం నగదు స్వాహా జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై డీపీవో ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీడీవో ఎం.భవానీ విచారణ జరిపారు. కలువాయి సచివాలయం-1లో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ నుంచి ఈ ఆరోపణలపై వాతపూర్వకమైన వివరణ తీసుకున్నారు. విచారణ నివేదికను డీపీవోకి పంపనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆమె వెంట సీనియర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు ఉన్నారు.

15 నుంచి పశువులకు టీకాలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి నెలపాటు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు గండిపాళెం పశువైద్యాధికారి ఎన్వీ రాఘవేంద్రశర్మ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు కొండాయపాళెం, వెంకట్రావుపల్లి గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. పాడిరైతులు పశువులకు తప్పని సరిగా టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10413
వెండి కిలో ధర	రూ. 128300
వెండి ఒక గ్రాము	రూ. 131.30

ఇన్‌చార్జి ఏడీఏగా చెన్నారెడ్డి

ఉదయగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ ఇన్‌చార్జి సహాయ సంచాలకులుగా పీ.చెన్నారెడ్డిని నియమిస్తూ మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఏడీఏగా పని చేస్తున్న లక్ష్మీమాధవి వైఎస్‌ఆర్ కడప జిల్లా ఏడీఏగా డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో సీతారామపురం మండల వ్యవసాయాధికారిగా పని చేస్తున్న పీ.చెన్నారెడ్డిని ఇన్‌చార్జి ఏడీఏగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఓర్వలేకనే అన్నదాత పోరు

ఆత్మకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక వైసీపీ అన్నదాత పోరు పేరుతో నిరసన చేపట్టిందని టీడీపీ నాయకులు ఆరోపించారు. మంగళవారం వారు టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం యూరియా ఎక్కడా కొరత లేదని, యూరియాను ఎవరూ బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడం లేదన్నారు. వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు, నిరసనలు చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ. వెంకటరమణమ్మ, టీడీపీ నాయకులు సుంకర కేశవచౌదరి, విజభాస్కర్‌రెడ్డి, పిడికెటి వెంకటేశ్వర్లు నాయుడు, సత్యం, పీ శైలజారెడ్డి, ఎం నారాయణ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఐడీ కార్డుల పంపిణీ



ఐడీ కార్డులు ధరించిన విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

ఉదయగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఐడీ కార్డులు, గ్రీన్ పాస్‌పోర్టులను మంగళవారం ఎంఈవో-2 టీ.శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు యజ్ఞ విద్యార్థులకు ప్రతి ఏడాది ఐడీ కార్డులు వితరణ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి, రిజిస్టర్లను పరిశీలించారు.

సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి

ఉదయగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వే వివరాలను సర్వే బృంద సభ్యులు యాప్‌లో పక్కాగా నమోదు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సర్వే బృందం సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామిత్వ సర్వేలో భాగంగా సేకరించిన నివాసాలు, ఖాళీ స్థలాల కొలతలను పక్కాగా ఫొటోలతో సహా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సర్వే ద్వారా ప్రజల ఆస్తులకు భరోసా లభిస్తుందని, సర్వే సభ్యులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

హుస్సేన్ నగర్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌నగర్‌లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలతోపాటు పలు వ్యాధులతో బాధపడుతున్న 40 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి లార్వా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ. పవన్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ వై. శ్రీనివాసులు, ఏఎన్ఎం ఉషా, ఆశ కార్యకర్త ఖదర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అవగాహన

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అవగాహన కల్పించారు. ప్రధానంగా బ్యాంకులకు సంబంధించిన నగదు నిర్వహణ, బ్యాంకులు అందించే సేవలు, విధివిధానాలు, డిజిటల్ లావాదేవీలు తదితర విషయాలను తెలియచేశారు.

విషజ్వరాలతో మంచమెక్కిన గ్రామీణులు

● ప్రైవేటు ఆస్పత్రులకు బాధితుల క్యూ ● గ్రామాల్లో మూతపడిన హెల్త్ క్లీనిక్‌లు ● సేవల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

సీతారామపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాలతో గ్రామీణులు అల్లాడిపోతున్నారు. ఏ ఇంట్లో చూసినా దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడేవారే కనిపిస్తున్నారు.దీంతో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి.మండలంలోని పబ్బులేటిపల్లి, చిన్ననాగంపల్లి, సీతారామపురం,అయ్యవారిపల్లి, గంగవరం, బసినేనిపల్లి తదితర ప్రాంతాల్లో వైరల్ ఫీవర్ బాధితులు ఎక్కువగా ఉన్నారు.ప్రధానంగా చిన్నారులకు జ్వరాలు వస్తుండటంతో వైద్యం కోసం తల్లిదండ్రులు నెల్లూరు,వింజమూరు, పోరుమామిళ్ల,ఆత్మకూరు తదితర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు.విషజ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.స్తోమత ఉన్న వారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు.లేనివారు ఏవో మందు బిల్లలు మింగుతూ ఇంటి వద్దే ఉంటున్నారు విషజ్వరాలు తగ్గకపోవడంతో ప్రైవేటు వైద్యశాలల్లో రూ. వేలు ఖర్చు చేయవలసి వస్తున్నదని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు.అయితే వైద్యాధికారుల సేవలు మాత్రం అంతంత మాత్రంగా ఉండటంతో జ్వరాలు అదుపులోకి రావడం లేదని వారు ఆరోపిస్తున్నారు.మండలంలో విష జ్వరాలతో అల్లాడుతుంటే పలు గ్రామాలలో అసలు విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు తాళాలే తీయడం లేదు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు..దగ్గు, జలుబు,తలనొప్పితో మొదలై ఒక్కసారిగా జ్వరం వచ్చి మంచాన పడి వారం పదిరోజులు తగ్గకపోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.దీంతో కొందరు భయపడి జ్వరం రాగానే ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.



మారంరెడ్డిపల్లిలో తాళాలు వేసి ఉన్న విలేజ్ హెల్త్ క్లీనిక్



ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్న ప్రజలు



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రక్త పరీక్ష కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

యూరియా సరఫరా చేయలేని ప్రభుత్వం ఇది..

ఆత్మకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియాను ప్రభుత్వం అందించలేకపోతున్నదని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన ఆత్మకూరులో అన్నదాత పోరులో పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతర ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో పావనికి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కావలసిన యూరియా, ఇతర ఎరువులను అందించలేకపోతున్నదని, అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నీ మండలాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

యూరియా వాడకంపై అవగాహన

సంగం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధిక యూరియా వాడడంవల్ల జరిగే అనర్థాలపై వ్యవసాయాధికారి శశిధర్ మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెరమన, కోలగట్ల గ్రామాల్లో రైతులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక యూరియా వాడడం వల్ల ఖర్చులు పెరగడంతోపాటు, పొలం దెబ్బతింటుదన్నారు. కావున జీవన ఎరువులు వినియోగించుకోవాలని, అధిక యూరియా వాడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



సంగం : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శశిధర్

వింజమూరు : యూరియా వాడకంపై మండలంలోని చాకలికొండ సచివాలయ పరిధిలోని రైతులకు మంగళవారం డివిజన్ వ్యవసాయాధికారి ఎం.శేషగిరి అవగాహన కల్పించారు. యూరియాను తక్కువ వాడాలని, అధిక యూరియా వాడడం వల్ల పంటలకు వైరస్ వస్తుందని, దాంతో దిగుబడి తగ్గుతుందని ఆయన తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఏ.వాసు మాట్లాడుతూ జనుములు, జీలుగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నామన్నారు. ఆర్ఎస్‌కే వీటిని తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎన్ఎఫ్ డివిజన్ అధికారి అంజిరెడ్డి, స్థానిక వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వింజమూరు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

వింజమూరులో ప్రభుత్వ హాస్టళ్ల తనిఖీ

వింజమూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ హాస్టళ్లను మంగళవారం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శోభారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక బాలికల హాస్టల్‌లో అల్పాహారం తనిఖీ చేసి , నూనె గురించి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణులయ్యేలా చూడాలని వసతి గృహ అధికారులను కోరారు. అనంతరం ఉదయగిరి సహాయ సంక్షేమ పరిధిలోని కళాశాల ప్రిన్సిపాళ్లు, వెల్ఫేర్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కే. రమణారెడ్డి, మండల వసతి గృహ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి

అందుబాటులో ఉండి, రైతులకు సేవలందించాలి

సీతారామపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు అందుబాటులో ఉండి, వారికి సేవలందించాలని డీసీసీబీ చైర్మన్ ధనుంజయరెడ్డి అన్నారు. ఆయన్ను మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు ఎస్. రాజశేఖర్ మంగళవారం నెల్లూరులోని డీసీసీబీ కార్యాలయంలో కలిసి శాలువా కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ మండలంలోని రైతులను ఆదుకునేలా రుణాలను మంజూరు చేయాలని, సొసైటీ కాంప్లెక్స్ గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య (గాంధీ), తోట ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



ధనుంజయరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సొసైటీ అధ్యక్షుడు రాజశేఖర్

ప్రమాదాలు జరక్కముందే నివారణ చర్యలు చేపట్టాలి

సీతారామపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) :నెమళ్లదిన్నె పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకముందే నివారణ చర్యలు తీసుకోవాలని సర్పంచి రామచంద్ర అన్నారు.మండల పరిధిలోని నెమళ్లదిన్నె పంచాయతీ గంగవరం గ్రామంలో మంగళవారం విద్యుత్ అధికారులు గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ పంచాయతీలో కరెంటు తీగలు వేలాడుతూ ఉండటం,కరెంట్ స్తంభాలు దెబ్బతిని ఉండటం,కొన్ని గ్రామాల్లో వోల్టేజ్ తక్కువగా ఉండడం లాంటి సమస్యలను విద్యుత్ అధికారులు అరికట్టాలని,ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ శ్రీహరి , లైన్‌మెన్లు, గ్రామ పెద్దలు గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న గ్రామస్థులు

ఎందుకనో తలుపులు తెరుచుకోలేదు...!

ఉదయగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం మంగళవారం మధ్యాహ్నం 11.30 గంటల వరకు తలుపులు తెరుచుకోలేదు. పది గంటలకు కార్యాలయం తలుపులు తీయాల్సి ఉండగా 11.30 గంటల వరకు తలుపులు తెరుచుకోకపోవడంతో కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన వారు వెనుతిరిగారు. ఈ విషయమై సీడీపీవో పుణ్యవతిని వివరణ కోరగా ఆత్మకూరులో జరుగుతున్న ఇంటర్వ్యూలకు తాను హాజరయ్యాయని, కార్యాలయాన్ని తెరిచి ఉంచాలని యాక్టివ్ సూపర్‌వైజర్‌కు సూచించామన్నారు.



తలుపులు తెరుచుకోని ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

అల్లుకున్న నిర్లక్ష్యం

అనంతసాగరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు అడ్డరోడ్డు వద్ద విద్యుత్ స్తంభాలకు పిచ్చిమొక్కల తీగలు అల్లుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి వల్ల ప్రమాదం పొంచిఉందని, విద్యుత్ అధికారులు స్పందించి ముళ్లతీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారి ఇలా.. రాకపోకలు ఎలా ..?



ఉదయగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవపాళెం ప్రధాన రహదారిలోని మురుగు కాలువ ధ్వంసమైంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా యాదవపాళెం ప్రజలతోపాటు కొండ కిందపల్లెల గ్రామాలవారు రాకపోకలు సాగిస్తుంటారు. కాలువ దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువను బాగుచేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఆగని రేషన్ బియ్యం దందా

● కార్డుదారుల వద్ద తక్కువ ధరకే డీలర్ల కొనుగోలు
● రైస్ మిల్లులకు తరలించి పాలీష్
● సరిహద్దులు దాటిస్తున్నవైనం
● పట్టించుకోని అధికారులు

సంగం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గంలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతున్నది. అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు ఈ దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేసినప్పుడు అక్రమార్కులు సానికంగా కొందరిని ఏర్పాటు చేసుకుని వారి ద్వారా బియ్యం సేకరించి తరలిస్తున్నారు. కొన్ని చోట్ల డీలర్లే కార్డుదారులకు నగదు ఇచ్చి కొనుగోలు చేసిన బియ్యాన్ని మాఫియా ముఠా సేకరిస్తారు. అనంతరం బుచ్చి, నెల్లూరులోని రైస్ మిల్లులకు తరలించి పాలీష్ పట్టించి బయట ప్రాంతాల్లో అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. కార్డుదారుల నుంచి కిల్లో రూ. 10 నుంచి రూ. 15లకు కొనుగోలు చేస్తున్నారు. పాలీష్ పెట్టిన బియ్యాన్ని రూ. 29లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో రేషన్ మాఫియా వచ్చే ఆదాయంతో రెవెన్యూ, పోలీసుఅధికారులకు నెల మామూళ్లు ముట్టచెబుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికుల ద్వారా సమాచారం అందినప్పుడు మాత్రమే అధికారులు స్పందించి పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల అనంతసాగరం మండలంలో వరుసగా రేషన్ బియ్యం నిల్వలపై అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. వారం ముందు అనంతసాగరంలోనే రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పట్టుకున్నారు. గత నెలాఖరుల్లో ఆత్మకూరులో కూడా పట్టుబడ్డాయి.ఈ నేపథ్యంలో తాజాగా సంగం మండలం సిద్దీపురం వద్ద జాతీయ రహదారిపై ఓ మినీ ట్రక్ వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారంతో దాడులు చేసి పట్టుకున్నారు. అలాగే ఆత్మకూరు మండల పరిధిలోని వాశిలి వద్ద జాతీయ రహదారిపై ఓ మినీ ట్రక్ వ్యాన్‌లో తరలిస్తుండగా సమాచారం రావడంతో ఆత్మకూరు పోలీసులు పట్టుకున్నారు.



సిద్దీపురం వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం ట్రక్ ఆటో (ఫైల్)

ఎస్సీ కార్పొరేషన్ లోన్లు ఇప్పిస్తామని మహిళలకు టోకరా!

● జిల్లా ఎస్పీతో బాధిత మహిళల మొర

ఇందుకూరుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు గ్రూపు లోన్లు ఇప్పిస్తామని చెప్పి ఒక గ్రూపులో రూ.15 లక్షలు, మరో గ్రూపులో రూ. 10 లక్షలు కాజేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈమేరకు బాధితులు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం బాధిత మహిళలు పరుసు జయమ్మ, పరుసు భవానీ, పరుసు సుజాత, పరుసు లక్ష్మి మీడియాతో మాట్లాడారు. ఇందుకూరుపేట మండలం చింతోపు గ్రామం అరుంధతివాడకు చెందిన పందింటి రమణయ్య అలియాస్ పోత్యం, పందింటి సుబ్బయ్య తమ గ్రామంలో పది మంది మహిళలకు గ్రూపు ద్వారా రూ.15 లక్షలు లోన్లు ఇప్పిస్తామని తమ వద్ద నుంచి ఆధార్, రేషన్, పాన్‌కార్డులు తీసుకున్నారన్నారు. లోన్ ఇప్పిస్తామని మభ్యపెట్టారని తెలిపారు. నెల్లూరులోని యూనియన్ బ్యాంకులో ఇంటి లోను కోసం మేనేజర్‌ని కలువగా మీరు మా బ్యాంక్ నుంచి గ్రూపులోను ద్వారా రూ.15 లక్షలు తీసుకున్నారని, వడ్డీతో సహా రూ.24 లక్షలు కట్టాలని బ్యాంకు వారు చెప్పారన్నారు. ఈ విషయం ఇంతవరకు తమకు తెలియదని చెప్పగా మీది స్వస్తిక్ గ్రూపు అని, మీ గ్రూపు అకౌంట్ నెంబరు 098001000202226 ఈ అకౌంట్ ద్వారా ఈ గ్రూపునకు రూ.15 లక్షలు లోను తీసుకున్నారన్నారు. మా గ్రామానికి చెందిన ఐదు మంది మహిళలు పేరు మీద ఈ లోన్లు తీసుకున్నట్లు మేనేజర్ తెలిపారు. ఈ విషయంపై రమణయ్య అలియాస్ పోత్యం, పందింటి సుబ్బయ్యను అడుగగా తాము బ్యాంకు లోన్లు కట్టామని, బ్యాంక్ మేనేజర్ డబ్బులు స్వాహా చేశాడని చెబుతున్నారన్నారు. 'మాకు సంబంధం లేదు.. మీకు దిక్కున్నచోట చెప్పుకోండి' అని బెదిరిస్తున్నారని మహిళలు తెలిపారు. తమ పేరుతో లోన్ తీసుకున్న మోసగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు కోరారు. 'నా భర్త అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. కూలికెళ్లి నేనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. మాకు న్యాయం చేయాలి' అని బాధిత మహిళ పరుసు భవానీ ఆవేదన వ్యక్తం చేసింది. 'పందింటి రమణయ్య, పందింటి సుబ్బయ్య అనే వ్యక్తులు తమ పేర్ల మీద రూ.15 లక్షలు లోను తీసుకుని మోసం చేశారని, ఇప్పుడు బ్యాంకు వాళ్లు మమ్మల్ని లోను కట్టమని ఒత్తిడి చేస్తున్నారు' అని వారు వాపోయారు. తమకు ఏ జీవనాధారమూ లేదని, తీసుకోని లోను మేమెలా కట్టాలి' అని భవానీ కన్నీటిపర్యంతమైంది.



మాట్లాడుతున్న బాధిత మహిళలు

మత్స్యకారుల మధ్య ఉద్రిక్తత

కలువాయి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం వద్ద మంగళవారం సభ్యత్వం కలిగిన మత్స్యకారులకు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన మత్స్యకారుల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక వ్యాపారులు కొందరు ఇతర జిల్లాల నుంచి మత్స్యకారులను తీసుకువచ్చి జలాశయంలో అక్రమంగా చేపలవేట సాగిస్తున్నారు. వారు జలాశయం పరిసరాల్లోనే నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్నారు. మంగళవారం స్థానిక మత్స్యకారులు ఇతర జిల్లాల మత్స్యకారులు ఉంటున్న ప్రాంతానికి వెళ్లారు. అక్కడ వారు వేటాడి ఎండబెట్టిన చేపలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు బయట ప్రాంతాల నుంచి వచ్చి, చేపపిల్లలను అక్రమంగా వేటాడి మాపొట్ట కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా బయట నుంచి వచ్చిన మత్స్యకారులు జలాశయం వదిలి వెళ్లిపోవాలని వారు హెచ్చరించారు. ఈ విషయమై మత్స్యశాఖ అధికారులకు ఎన్ని సార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జేసీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



ఆందోళన చేస్తున్న స్థానిక మత్స్యకారులు

మైనింగ్ జరిగితే ప్రాణాలు వదిలేస్తాం..

● అధికారులతో వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లి గ్రామస్థులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల పరిధిలో మైనింగ్ తవ్వకాలు జరిగితే ప్రాణాలు వదిలేస్తామంటూ వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు మంగళవారం అధికారులు, లీజుదారుల ఎదుట తమ గోడు వినిపించారు. వరికుంటపాడు, భాస్కరాపురం రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన సరే నంబర్లు 233, 1లోని కొండ ప్రాంతంలో మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ కొంతమంది స్థానికులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో నోటీసులు అందుకున్న కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ శాఖ ఈఈ అశోక్‌కుమార్ వివాదాస్పదంగా మారిన ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. కొండ ప్రాంతం నుంచి జంగంరెడ్డిపల్లికి చెందిన నివాసాలు కేవలం 130 మీటర్ల దూరం మాత్రమే ఉండడాన్ని గుర్తించి విస్తుపోయారు. కాగా కంపెనీ ప్రతినిధులు ముందుగానే హద్దు రాళ్ల మార్చేందుకు ప్రయత్నించడంతో విషయం తెలుసుకున్న జంగంరెడ్డిపల్లి గ్రామస్థులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాల్సిన అవసరం ఏముందంటూ నిలదీయడంతో కంపెనీ ప్రతినిధులు మౌనం వహించాల్సి వచ్చింది. సేకరించిన నివేదికలను ఉన్నతాధికారుల ద్వారా హైకోర్టుకు అందచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు దిలీప్‌కుమార్, మేధావుల ఫోరం సభ్యుడు సరాబు లక్ష్మీనారాయణ, వినియోగదారుల ఫోరం, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్, షేక్ పీరయ్య, మాజీ ఉప సర్పంచు సుంకర రాధాకృష్ణ, వార్డు సభ్యుడు నల్లగొర్ల వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.



కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈఈ అశోక్‌కుమార్

మారుమూల గ్రామాలకు 5జీ టెలికం సేవలు

● బీఎస్ఎన్ఎల్ డీజీఎం శ్రీనివాసరావు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎటువంటి టెలికం సేవలులేని మారుమూల గ్రామాల్లో సైతం 5జీ సేవలు అందించేందుకు చర్యలు తీసు కుంటున్నామని బీఎస్ఎన్ ఎల్ డిప్యూటీ జీఎం మిట్టా శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ డిజిటల్ ఇండియా పథకం కింద నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో 72 గ్రామాల్లో ఆరు నెలల్లో 5జీ సర్వీసుతో టెలికం సేవలు అందుతాయని తెలిపారు. ఇప్పటి వరకు 356 టవర్లు ఉండగా అదనంగా 35 టవర్లు ఏర్పాటు చేశామని, మరో 56 టవర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఫ్రీడమ్ పథకాన్ని ఈనెల 15 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్ ఉచితమని, 1నెల రీచార్జ్ కేవలం ఒక్క రూపాయితో చేసుకుంటే 30 రోజులు 2జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజూ 100 ఎస్ఎంఎస్‌లు పొంద వచ్చని తెలిపారు. ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వినియోగదారులు అదనంగా రూ.140 చెల్లిస్తే ఇంటర్నెట్‌తోపాటు సినిమా చానల్స్ చూసి ఆనందించే అవకాశం కల్పించామని తెలిపారు. వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.



మిట్టా శ్రీనివాసరావు

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258

కోడిగుడ్ల ధర (100): 545

ఎస్సీ కాలనీ శ్మశాన స్థలాన్ని కాపాడండి

కందుకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం మండలం మాలకొండరాయునిపాలెం పంచాయతీ ముక్తేశ్వరం ఎస్సీ కాలనీ శ్మశాన స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకుని శ్మశాన స్థలాన్ని కాపాడాలని మంగళవారం ఆ కాలనీవాసులు సబ్ కలెక్టరు దామెర హిమవంశీని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన సబ్ కలెక్టరు హిమవంశీ అక్కడికక్కడే లింగసముద్రం తహసీల్దారుతో ఫోన్‌లో మాట్లాడి గ్రామాన్ని సందర్శించి పరిశీలన చేయటంతో పాటు శ్మశానస్థలానికి సర్వేచేయించి వారంలోగా నివేదిక అందజేయాలని ఆదేశించారు. సబ్ కలెక్టరును కలిసిన వారిలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, ముక్తేశ్వరంకు చెందిన గొడపేరు రత్నం, ఏసోబు, బాలయ్య, సామేలు, కోటేషు, ఆదాము, రజనీకాంత్, రమేష్ తదితరులున్నారు.

'విద్యుత్'లో సిబ్బంది కొరత!

- ఇబ్బడి ముబ్బడిగా మరమ్మతులు
- సరఫరాలో తరచూ అంతరాయం
- ప్రైవేట్ వ్యక్తులతో రైతుల పనులు
- సిబ్బందిని నియమించాలని వినతి



వలేటివారిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్

వలేటివారిపాలెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు, చుండి, వలేటివారిపాలెం, నలదలపూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతోన్నాయి. మండలంలో సుమారు 2,600 వ్యవసాయ కనెక్షన్‌లు, 10,100 గృహ వినియోగాదారులు, వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. వీరందరికి సిబ్బంది కొరత కారణంగా నాణ్యమైన విద్యుత్ అందించలేకపోతున్నారు అంతేగాకుండా విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో రైతులు ప్రయివేట్ వర్కర్‌లను ఆశ్రయిస్తున్నారు. అయినా డబ్బులు, సమయం వృథా అవుతుందే తప్ప సమస్య తీరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సరిపడు సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు. మండలంలో వలేటివారిపాలెం, చుండి, పోకూరు, నలదలపూరు గ్రామాల్లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 23 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 16 మంది మాత్రమే ఉన్నారు. పోకూరు, చుండి, పోలినేనిపాలెం, వలేటివారిపాలెం, జమీన్‌ఉప్పలపాడు, మాలకొండ, శింగమనేనిపల్లె గ్రామాల్లో సిబ్బంది లేరు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే పొల్లాలో ఏదో ఒక విద్యుత్ సమస్య తలెత్తుతోంది. ఆ సమస్యలను అధిగమించాలంటే తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ఎప్పటికప్పుడు పరిష్కరించలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మారుమూల గ్రామాల్లో రాత్రిళ్లు విద్యుత్ సమస్య ఏర్పడితే చిన్న చిన్న మరమ్మతులు చేయాలన్నా ప్రయివేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

● బోర్ల వద్ద ఫీజులు పోయినా...

రైతులు వ్యవసాయ బోర్లకు అమర్చిన ట్రాన్స్‌పార్మర్ల వద్ద కనీసం ఫీజు పాడైనా అమర్చే వారు లేక ప్రయివేట్ వ్యక్తులకు రైతులు వందల రూపాయలు ఇచ్చి ఫీజు వేయించుకొంటున్నారు. ప్రభుత్వం అందించే ఉచిత విద్యుత్ రైతులకు రెండు విడతులుగా అందిస్తున్నారు. రాత్రి వేళ్లలో సరఫరాలో అంతరాయం ఏర్పడితే సరిచేసే సిబ్బంది లేకపోవడంతో రైతులే సరిచేసుకొంటుండడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయేనని ఆందోళన చెందుతున్నారు.



వలేటివారిపాలెంలో కూలడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

● కొత్త సర్వీసులను అమర్చాలంటే...

రైతులు బోర్లను వేసుకొని వాటికి కొత్తగా సర్వీసు అమర్చుకోవాలంటే ప్రయివేట్ వ్యక్తులను ఆశ్రయించాలి. పొలాల్లో కొద్దిపాటి పనులు చేయాలన్నా ప్రయివేట్ వ్యక్తులే దిక్కు. రైతులు పొల్లాల్లో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను నిటారుగా నిలబెట్టాలన్నా, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడానికి కూడా సిబ్బంది లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన సిబ్బందిని నియమించాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

సిబ్బంది కొరత వాస్తవమే..

మండలంలో విద్యుత్ సిబ్బంది కొరత వాస్తవమే. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. దీనిని అధిగమించడానికి తగిన సిబ్బందిని నియమించాలి. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. ఉన్న సిబ్బందితోనే పనులు చేయిస్తున్నాం. సరఫరాలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

\- తాటికొండ మధుబాబు, ఏఈ



నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాతో నిఘా

● ఫిరోజ్, వన్‌టౌన్ సీఐ, కావలి

కావలిరూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ శివారు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచాం. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, చట్టవ్యతిరేక చర్యలు చేపట్టినా తక్షణం తెలిసిపోతోంది. వెంటనే తమ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకునేందుకు డ్రోన్ కెమెరా ఎంతో దోహదపడుతుందని కావలి వన్‌టౌన్ సీఐ ఫిరోజ్ తెలిపారు.

? నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! పట్టణ శివారు ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో నేరాల నియంత్రణకు డ్రోన్‌లను వినియోగిస్తున్నాం.

? మత్తుపదార్థాల నియంత్రణకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు.

! పట్టణ పరిసర ప్రాంతాల్లో మత్తుపదార్థాల అమ్మకాలు, వినియోగం జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాం. విద్యార్థుల ప్రవర్తన, కదలికలపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలి.

? సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.

! పట్టణంలోని విద్యా సంస్థల్లో విద్యార్థులు, యువతకు నేరాలు, సైబర్ నేరాలపై వివిధ రకాలుగా అవగాహన కల్పిస్తున్నాం.

? ట్రాఫిక్ నియంత్రణకు ఎలాటి చర్యలు చేపడుతున్నారు.

! పట్టణంలోకి లగేజీతో వచ్చే గూడ్సు లారీల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. లారీలను రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో మాత్రమే పట్టణంలోకి అనుమతిస్తున్నాం.

బీజేపీలో చేరిక

కందుకూరు, సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి): లింగసముద్రం మండలం వెంగళాపురంకు చెందిన రాతికింది వేణు, రాతికింది కొండమ్మలు మంగళవారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల రాఘవయ్య, జగన్నాథం వైకుంఠం, మువ్వల భూషయ్య, మట్లె ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

హలో.. హలో.. వినిపిస్తోందా..!?



వలేటివారిపాలెం లోని బీఎస్ఎన్ఎల్ టవర్

వలేటివారిపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నుంచి సేవలు నిలిచిపోయి నిరుపయోగంగా మారింది. కరెంట్ పోతే చాలు బీఎస్ఎన్ఎల్ ఫోన్లు పనిచేయడం లేదు. ప్రభుత్వ అధికారిక సిమ్‌లు అధికంగా బీఎస్ఎన్ఎల్‌వే ఉండడంతో సమాచారం ఉన్నతాధికారులకు చేరవేయడానికి, మాట్లాడేందుకు అవస్థలు పడుతున్నారు. ఫోన్ చేస్తే హలో.. హలో.. వినిపిస్తోందా అనుకుంటుండగానే కాల్ కట్ అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలను పునరుద్ధరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

రైల్వే అధికారులకు ధన్యవాదాలు

బిట్రగుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ ఎత్తేసిన రైళ్లలో కొన్నింటికి మళ్లీ స్టాపింగ్ ఇస్తున్నందుకు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం మిఠాయిలు పంపిణీ చేసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రైల్వే అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి చెన్నై-కాట్రా వెళ్లే అండమాన్, చెన్నై-లక్నో, తిరుపతి-కాకినాడ ఎగువ, దిగువ మార్గాల్లో నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగనున్నాయి. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్, బత్తుల రవిచంద్ర, మునుస్వామి వేణు, షేక్.జహీర్, రాజారత్నం, నవీద్, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు, కార్మికులు సంఘటితంగా పోరాడాలి

జలదంకి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవాలంటే రైతులు, వ్యవసాయ కార్మికులు సంఘటితంగా పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయం సురే చెంచురెడ్డి భవన్‌లో ఖాజీబీ అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం 6వ మహాసభలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బత్తన నరసింహం, మేలంగి ఆంథోనీబాబు, సభ్యులుగా ఏడుగురుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరి మాల్యాద్రి, రైతుసంఘం నేత గడ్డం మాల్యాద్రి, మేలంగి ఆంథోనీబాబు తదితరులు ప్రసంగించారు. ఈ మహాసభకు మండలంలోని పలుగ్రామాలకు చెందిన వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

పగిలిన మంచినీటి పైపులైను

లింగసముద్రం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన లింగసముద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి పెట్రోల్ బంకు ఎదురుగా ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న అంతర్గత మంచినీటి పైపులైను పగిలి నీరు వృథాగా పోతోంది. ఐదు రోజుల క్రితం స్థానికులు ఒకరు ఈ రోడ్డు పక్కనే గుంత తీస్తుండగా ఎక్స్‌కవేటర్ బకెట్ మంచినీటి పైపుకు తగిలడంతో మంచినీటి పైపు పగిలి పోయింది. దీంతో మంచినీరు వృథాగా పోవడంతో పరిసర ప్రాంతాల్లో కుళాయిలకు నీరు తక్కువగా వస్తోంది. అంతేగాకుండా మంచినీరు రోడ్డుపై నిలిచి వాహనాల రాకపోకల సమయంలో పాదాచారులపై పడుతుండడంతో ఇబ్బందిపడుతున్నారు. అయితే మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

కొండాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొండాపురంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆపార్టీ మండల కన్వీనర్ ఆకుల వెంకట్ మంగళవారం ప్రారంభించారు. పార్టీ సీనియర్ నాయకులు వేములపాటి అజయ్‌కుమార్ సూచనల మేరకు కొట్టే వెంకటేశ్వర్లు సారధ్యంలో కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మండలంలో నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో ముందుండి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అక్బర్‌బాషా, మండల కార్యవర్గ సభ్యులు బీ.వాసు, పీ.శ్రీనివాసులు, ధనలక్ష్మి, ఎం.శ్రీనివాసులు, నియోజకవర్గంలోని జనసేన మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' పేరుతో మోసం

● వైసీపీ రైతుపోరు ర్యాలీలో ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి రాజగోపాల్ రెడ్డి



ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

కావలి(టౌన్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకం పేరుతో ప్రభుత్వం రైతులను ముంచిందని వైసీపీ ఉదయగిరి నియోజక వర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. కావలి, ఉదయగిరి నియోజకవర్గాల వైసీపీ శ్రేణులు సంయుక్తంగా మంగళవారం పట్టణంలో రైతుపోరు నిరసన ర్యాలీ నిర్వహిం చారు. ఆర్ఎస్ఆర్ కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫల మయ్యాయి. చివరకు వైసీపీ శ్రేణులు రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయం వరకు చేరుకున్నారు. ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. అనంతరం రాజగోపాల్ రెడ్డి, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజులు విలేకర్లతో మాట్లాడారు. రైతులకు యూరియా సరఫరా చేయకుండా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్, కనమర్లపూడి నారాయణ, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

● జలదంకి(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో జరిగిన రైతుపోరు నిరసనకు మండలంలోని జమ్మలపాలెం నుంచి ఉదయగిరి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు ముందుగా జమ్మలపాలెం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, పాలవల్లి మాలకొండారెడ్డి, మేదరమెట్ల శివలీల, రావి ప్రసాద్‌నాయుడు, తమ్మినేని సతీష్‌నాయుడు, బీవీ కృష్ణారెడ్డి, గండు వెంకారెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు అందించాలి

● వైసీపీ ఆధ్వర్యంలో కందుకూరులో రైతు పోరుబాట



కందుకూరు : పోరుబాట ర్యాలీలో వైసీపీ శ్రేణులు

కందుకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో ఎరువులు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ కోరారు. రైతుపోరు కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించగా సీఐ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేసి బుర్రా మాట్లాడిరు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరినే కలవరిస్తున్న బుర్రా

కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్న బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను గత ఎన్నికల సమయంలో ఆపార్టీ అధినేత జగన్ కందుకూరుకు పంపించినప్పటికీ ఆయన ఇప్పటికీ కనిగిరినే కలవరిస్తుండటం పట్ల వైసీపీ కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రైతు పోరుబాట కార్యక్రమంలో మాట్లాడుతూ కరేడు రైతులకు అండగా నిలుస్తామని వారి పొలాలు ప్రభుత్వం తీసుకోకుండా కాపాడతామని వారంతా కనిగిరి నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉండేలా కృషి చేస్తానని ప్రకటించారు. దీంతో ఖంగుతిన్న ఆపార్టీ ద్వితీయశ్రేణి నేతలు ఏదో అలవాటులో పొరపాటు అయిఉంటుందిలే అని భావించి కనిగిరి కాదు కందుకూరు అని సవరించే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన వినకుండా మా కనిగిరి నియోజకవర్గంలో కూడా ఇలాంటి సమస్యలే ఉన్నాయి, అందుకే ప్రస్తావించాను అనడంతో నేతలు అవాక్కయ్యారు.

యూరియా అధిక వినియోగంతో అనర్థం



ఉలవపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో విజయకుమార్



వలేటివారిపాలెం : నేకునాంపురంలో రైతులకు పీఎండీఎస్ కిట్స్ అందజేస్తున్న ఏవో శేషారెడ్డి



లింగసముద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు దుర్గ, హర్షవర్ధన్‌లు

ఉలవపాడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : యూరియా అధికంగా వాడితే పంటలో దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి విజయ్ కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని ఆత్మకూరులో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. అధికంగా యూరియా వాడకం వలన నేలలో ఆమ్ల గుణం పెరిగి నేల సారవంతం కోల్పోయి భాస్వరం, పోటాష్ లభ్యత తగ్గుతుందన్నారు. ప్రధాన పంటకు ముందు పచ్చిరొట్ట పంటలను సాగు చేసుకోవాలన్నారు. పీఎండీఎస్ బహుళ ధాన్యాల 6 కిలోల కిట్ ధర రూ.500 అందిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు, వీపీఏ అజయ్, సాజిద్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే లక్ష్యం

● వలేటివారిపాలెం : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఏవో కేవీ శేషారెడ్డి తెలిపారు. మండలంలోని నేకునాంపురంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ శేషారెడ్డి మాట్లాడుతూ పంటల్లో చీడపీడల నివారణా చర్యలకు అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలని తెలిపారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగుమందులను వినియోగించకూడదని చెప్పారు. అలా వినియోగించడం వలన తెగుళ్లు ఎక్కువై దిగుబడులు తగ్గిపోతాయని తెలిపారు. అనంతరం రైతులకు పీఎండీఎస్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పంటల సాగుతో ప్రయోజనం

● లింగసముద్రం: రైతులు పచ్చిరొట్ట పంటలు, నవధాన్యాలు, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయాలని పొలం పిలుస్తోంది ఇన్‌చార్జ్ కె హర్షవర్ధన్, ఇన్‌చార్జ్ మండల వ్యవసాయ అధికారి దుర్గ చెప్పారు. మంగళవారం మండలంలోని వెంగళాపురం, లింగసముద్రం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీపీఏలు దీప, రేణుక, ఏఎంసీ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



పాముల కాలనీలో బెల్లం ఊటను పారబోస్తున్న ఎస్ఐ నారాయణ

లింగసముద్రం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాటు సారా కాసేందుకు నిల్వ ఉంచిన బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. మంగళవారం రాత్రి లింగసముద్రం పంచాయతీలోని జంగంరెడ్డిపాలెం పాములకాలనీలో ఒక వ్యక్తి ఇంటిలో బెల్లం ఊట కాచి నిల్వ ఉంచారని ఎస్ఐ ఎం.నారాయణకు అందిన సమాచారం మేరకు ఆయన సిబ్బందితో కలసి దాడి చేశారు. అయితే బెల్లం ఊటను నిల్వ ఉంచిన నిందితుడు పోలీసుల రాకను గమనించి పరారయ్యాడు. దీంతో ఇంట్లో గాలించి డ్రమ్ములో నిల్వ ఉంచిన బెల్లం ఊటను బయట పారబోశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. నిందితుడిని త్వరలో పట్టుకుంటామ న్నారు. ఈ దాడిలో రైటర్ కే.శ్రీనివాసులు, షేక్ నస్రుల్లా, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చండి

కలిగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండ లంలోని కలిగిరి, సిద్ధనకొండూరు పీఏసీఎస్ చైర్మన్‌లు కదిరి వెంకట రంగారావు, మెట్టుకూరు కృష్ణజీవిరెడ్డిలు ఎన్‌డీసీ సీబీ చైర్మన్ మెట్టుకూరి ధనుంజయరెడ్డిని మంగళవారం జిల్లాకేంద్రంలో ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. పీఏసీఎస్‌ల పరిధిలో పంటలు సాగుచేస్తున్న రైతులకు యూరియా కొరత తీర్చాలని వినతి పత్రం అందించారు. సొసైటీ పరిధిలోని రైతుల పంటల సాగుకు సుమారు 100 టన్నుల యూరియా కేటాయించాలని కోరగా రైతులకు ఎరువుల పంపిణీలో ఇబ్బందులు లేకుండా చేస్తామని ధనుంజయరెడ్డి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

గ్రామ కంఠాల్లో ఇళ్లు, స్థలాలకు హక్కులు



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వలేటివారిపాలెం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : గ్రామ కంఠాల్లో ఇ ళ్లు, స్థలాలపై ప్రజలకు యాజమాన్య హక్కు కల్పించడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెంలో స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి పారదర్శకత నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జలదంకి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డైట్ అధ్యాపకురాలు ఎం.పద్మజ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం ఆమె జలదంకి మోడల్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)ను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనను, విద్యార్థుల గ్రేడ్ విధానాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని, పాఠశాల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థుల బోధన పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.ఇమ్మానుయేల్, ఉపాధ్యాయులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డైట్ అధ్యాపకురాలు పద్మజ

పొగాకు నారుమడులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● వేలం నిర్వహణాధికారి శివకుమార్



పొగ నారుమళ్లు పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

కలిగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో పొగనారుమళ్లు పెంపకానికి రైతులు బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వేలం నిర్వహణాధికారి వీ.శివకుమార్ తెలిపారు. మంగళవారం వేలం కేంద్రం పరిధిలోని కావలియడవల్లి, హసనాపురం, వేల్పులగుంట తదితర గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పొగాకు నారుమళ్లను బోర్డు అధికారులు, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా నారుమళ్ల సాగులో యజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన నారు ఉత్పత్తి చేయాలని కోరారు. అదేవిధంగా పొగాకు నర్సరీలు, నారుమళ్లు అనుమతి లేకుండా సాగుచేస్తే పొగాకుబోర్డు చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. అనుమతి లేకుండా సాగుచేసిన వారివద్ద నారు కొనుగోలు చేసి రైతు పంట సాగుచేస్తే వారి బ్యారన్ లైసెన్సు రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్రాధికారి సంతోష్‌కుమార్, క్షేత్రసహాయకులు బుట్టి రోహిత్, వీ.వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో ఏం జరుగుతోంది?

- ఆడపిల్లల నిష్పత్తి ఎందుకు తగ్గుతోంది?
- విచారణకు ఆదేశించిన కలెక్టర్


నివేదిక చూపుతున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెయ్యి మంది మగశిశువులకు.. 629 ఆడ శిశువులు మాత్రమే జన్మిస్తున్నారు. ఇదీ గత మూడు నెలల్లో శ్రీకాళహస్తిలోని జనన గణాంకాల నిష్పత్తి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1000:900 ఉంటే, శ్రీకాళహస్తిలో మాత్రం ఆ నిష్పత్తి ప్రమాదకరంగా ఉంది. ఈ నివేదికను చూసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆందోళన వ్యక్తంచేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్స్ అడ్వైజర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో విచారణ కమిటీ వేసి విచారించి.. కారణాలు విశ్లేషించి నెలలోపు నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్‌ను ఆదేశించారు. ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోం వైద్యులపై నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో లింగనిర్ధారణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టంచేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దుచేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. మారుమూల గ్రామాల్లోనూ లింగనిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, డీఐవో శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



నాకు పని చేయడమే తెలుసు

- టీటీడీలో బాధ్యతల నిర్వహణ ఎన్నోజన్మల పుణ్యఫలం
- సన్మాన సభలో ఈవో శ్యామలరావు

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'నాకు నిత్యం పనిచేయడమే తెలుసు. ప్రచారం చేసుకోవడం తక్కువ. చాలా దూర దృష్టితో పటిష్ఠ నిర్ణయాలు తీసుకుని అమలు చేశాం. టీటీడీ అంటే మినీ గవర్నమెంట్. తిరుమలలో భక్తుల సౌకర్యాలు ఓ వైపు, స్థానిక ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు మరోవైపు ఉంటాయి. ఈ రెండిటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. టీటీడీలో పనిచేయడం ఎన్నోజన్మల పుణ్యఫలం' అని బదిలీపై వెళుతున్న ఈవో శ్యామలరావు అన్నారు. తిరుపతిలోని టీటీడీ ఏడీ బిల్డింగులో మంగళవారం సాయంత్రం జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తుండటం చాలా ఆనందంగా ఉందన్నారు. లోపాలను సవరించుకుంటూ మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఉద్యోగుల సహకారాన్ని మరువలేనిదన్నారు. వచ్చే 25 ఏళ్లను దృష్టిలోపెట్టుకుని భక్తులకు అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాల నాణ్యతగా ఉండేలా వ్యవస్థలను తీసుకొచ్చామన్నారు. తనకు అవకాశమిచ్చిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. టీటీడీలోని ఉన్నతాధికారులు, అధికారులు శ్యామలరావు సేవలను కొనియాడారు. తిరుమల, తిరుచానూరు, శ్రీనివాసమంగాపురం ఆలయాల అర్చకులు ఈవోకు వేదాశీర్వచనం చేశారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

టీటీడీ ఈవోగా నేడు సింఘాల్ బాధ్యతల స్వీకరణ

టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం బాధ్యతలు తీసుకోనున్నారు. ప్రస్తుతం ఈవోగా ఉన్న శ్యామలరావును జీఏడీకి బదిలీ చేయడంతో పాటు ఆస్థానంలో గతంలో ఈవోగా పనిచేసిన అనిల్‌కుమార్ సింఘాల్‌ను మళ్లీ ఈవోగా నియమించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బుధవారం ఉదయం 11-11.30గంటల మధ్య శ్రీవారి ఆలయంలో సింఘాల్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే టీటీడీ బోర్డు ఎక్స్అఫిషియో సభ్యుడిగానూ బాధ్యతలు తీసుకుంటారు.

14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికారత సదస్సు

- హాజరు కానున్న 250మంది మహిళా ప్రజా ప్రతినిధులు


మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 14, 15 తేదీల్లో చట్టసభల జాతీయ మహిళా సాధికారత సదస్సు జరగనుంది. తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో పార్లమెంటు స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగే ఈ సదస్సుకు పార్లమెంటు మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరితో పాటు సభ్యులు, దేశంలోని వివిధ రాష్ట్రాల అసెంబ్లీ, శాసనమండలిలో ఉన్న ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు 250మంది హాజరవుతున్నారు. పార్లమెంటు స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ హరివంశ్ నారాయణసింగ్, సీఎం చంద్రబాబునాయుడు తదితరులు హాజరై 14న ఉదయం 10.30గంటలకు సదస్సును ప్రారంభించనున్నారు. మొదటి రోజు మహిళల సాధికారత, నాయకత్వం, రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చిస్తారు. అదేరోజు సాయంత్రం 7గంటలకు స్పీకర్ చింతకాయల అయన్నపాత్రుడు నేతృత్వంలో చంద్రగిరి కోట వద్ద లైటింగ్‌షో ఏర్పాటు చేసి విందు ఇవ్వనున్నారు. 15న ఉదయం డెలిగేట్లు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. ఉదయం 10.30గంటలకు సదస్సు ప్రారంభమవుతుంది. అనంతరం జరిగే ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఆ తర్వాత సభ్యులు శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకుని షార్‌ను సందర్శించనున్నారు. అతిథుల కోసం తిరుపతిలోని స్టార్ హోటళ్లలో గదులు బుక్ చేశారు. సదస్సు జరిగే కన్వెన్షన్ సెంటర్ పక్కన 400 వాహనాల పార్కింగ్‌కు సిద్ధం చేస్తున్నారు.

సమన్వయంతో విధులు నిర్వహిద్దాం

తిరుపతిలో జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు విజయవంతానికి సమన్వయంతో విధులు నిర్వహిద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్‌తో కలిసి ఆయన సదస్సు ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. డెలిగేట్లకు వసతి, రవాణా, భద్రత, వైద్యసదుపాయాలు, ప్రొటోకాల్ ఏర్పాట్లపై విభాగాల వారీగా అధికారులకు విధులు కేటాయిస్తామన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. లైజాన్ అధికారులకు స్మార్ట్ సిటీ జనరల్ మేనేజరు చంద్రమౌళి శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, శాసనసభ సెక్రటరీ జనరల్ కార్యాలయ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- మత సామరస్యానికి ప్రతీక
- బంధుమిత్రుల సంగమ వేదిక


పోలేరమ్మ శిలాప్రతిమకు ప్రత్యేక పూజలు

నేటి నుంచి పోలేరమ్మ జాతర

- రాత్రికి కొలువుదీరనున్న అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ (ఫైల్ ఫొటో)

వెంకటగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ పుట్టినిల్లు కుమ్మరిల్లు. మెట్టినిల్లు చాకలిల్లు. ఇలా 18 కులాల భాగస్వామ్యంతో వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర బుధవారం మొదలు కానుంది. ఒక్కో కులానికి ఒక్కో బాధ్యత ఉంటుంది. కుల, మత సామరస్యతకు ఈ జాతర ప్రతీక. దేశ, విదేశాల్లోని బంధుమిత్రులు తరలివచ్చి వారం రోజులపాటు సంతోషంగా గడిపేందుకు ఈ జాతర ఒక వేదిక. బుధ, గురువారాల్లో పోలేరమ్మ జాతర జరిగినా.. ఆదివారం ఘటోత్సవంతోనే వెంకటగిరిలో సందడి మొదలైంది. ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమంతో జాతర వాతావరణం నెలకొంది. ఇక, బుధవారం తెల్లవారే అమ్మవారి పుట్టినింటి వారైన కుమ్మరివారు వెంకటగిరి చెరువు నుంచి బంకమట్టి తీసుకు రానున్నారు. మధ్యాహ్నం రాహుకాలం ముగిశాక ఆ మట్టిని పసుపుతో కలిపి సాయంత్రం 4 నుంచి 6 గంటల్లోపు అమ్మవారి ప్రతిమను తయారు చేస్తారు. కళ్లు, దిష్టి చుక్క ఎటువంటి అలంకారం లేకుండా భక్తుల దర్శనార్థం ఉంచుతారు. అక్కడి నుంచి అమ్మవారి ప్రతిమకు తెల్లగుడ్డతో ముసుగు వేసి కట్టెలతో చేసిన పల్లకిపై అమ్మవారి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటి వద్దకు రాత్రి 9.30 నుంచి 10.30 గంటలకు తీసుకెళతారు. పురవీధుల్లో ఊరేగుతూ పూజలందుకుంటున్న అమ్మవారి విశ్వరూపంగా భావించే బలి దున్నపోతు, ఘటుంకుండలు కాంపాళెంకు వచ్చి అరవపాళేనికి చేరుకోవడంతో ఘటుం కార్యక్రమం ముగుస్తుంది. సుమారు 11 గంటల సమయంలో కాంపాళెం వద్ద అమ్మవారి అప్పచెల్లెళ్లుగా భావించే గాలిగంగలకు పూజలు చేసి పొట్టేలును బలిచ్చి అమ్మవారికి తొలి నైవేద్యం చెల్లించడంతో పాటు ఆచార సంప్రదాయాలతో గాలిగంగల సారెలను ముగిస్తారు. గాలిగంగలు జీనిగలవారి వీధిలోని చాకలింటికి చేరుకొని అమ్మవారి ముందు నిలవడంతో కోడి తలను నోటితో కొరికి అమ్మవారికి కళ్ళు, దిష్టిచుక్కను ఏర్పాటు చేసి ఆభరణాలతో అలంకరిస్తారు. విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన చప్పరంపై అమ్మవారిని ఊరేగింపుగా తీసుకు వచ్చి గురువారం తెల్లవారు జామున పోలేరమ్మ దేవస్థానం వద్ద వేపమండలతో సిద్ధం చేసిన మండపంలో కొలువుదీర్చనున్నారు. అమ్మవారిని గురువారం భక్తులు దర్శించుకుంటారు.

ఆచార సంప్రదాయాలు పాటిస్తూ..

పోలేరమ్మ జాతర అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాలను పాటిస్తారు. ఆ ప్రకారం.. జాతర సందర్భంగా ఇళ్లలో నట్టింట గోడపై ఎర్రమట్టితో అలికి పసుపు కుంకుమతో అమ్మవారి ప్రతిమను సిద్ధంచేసి పూజలు చేస్తారు. అంబలితో పాటు కరవాడు, వంకాయ పులుసును అమ్మవారి నైవేద్యంగా సమర్పిస్తారు. చిన్నా, పెద్ద.. బీదా, ధనిక తేడా లేకుండా బుట్టలు, గిన్నెలు చేతబట్టి ఇలిల్లూ తిరుగుతూ పోలేరమ్మకు మడి భిక్షం పెట్టండంటూ భిక్షాటన చేసి మొక్కులు చెల్లించుకొంటారు.

వారికి న్యాయం చేస్తాం

- ఆ రెండింటినీ విత్‌హెల్డ్‌లో పెడుతున్నామన్న స్విమ్స్ డైరెక్టర్



తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలువురు వైద్య అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్న విమర్శల నేపథ్యంలో స్విమ్స్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్‌పై టీటీడీ పునరాలోచించింది. సహేతుకంగాలేని డెంటిస్ట్రీ, నాన్ క్లినికల్ పోస్టులను హోల్డ్ చేస్తూ తక్కిన వాటికి యథావిధిగా రిక్రూట్‌మెంట్ చేయనున్నట్టు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. డెంటిస్ట్రీ పోస్టును వైసీపీ నేతకు అనుకూలంగా 'ఓరల్ మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ'గా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారన్న ఆరోపణలపై 'నేను చెప్పిన అభ్యర్థికే పోస్టు దక్కాలి' శీర్షికన ఈనెల 4న ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. అలాగే, స్విమ్స్ వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ చేసిన నాన్ క్లినికల్ అభ్యర్థులను నోటిఫికేషన్‌కు టీటీడీ దూరంపెట్టిందని 'చదువుచెప్పిన చోటే వద్దంటోంది' శీర్షికన 6వతేది మరో కథనం ప్రచురితమైంది. ఈనేపథ్యంలో స్విమ్స్, టీటీడీ ఉన్నతాధికారులు పునరాలోచించారు. వాటిని హోల్డ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ నిర్వహణలోని స్విమ్స్‌లో 9 ప్రొఫెసర్లు, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 67 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి గతనెల 14న నోటి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఫికేషన్ జారీ అయింది. ఈ నోటిఫికేషన్‌లో బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్‌కు ఎండీ, ఎంఎస్ లేదా డీఎస్సీ అర్హతలు కావాలని నిర్దేశించింది. దీంతో స్విమ్స్‌లోనే చదివిన ఎంఎస్సీ/పీహెచ్‌డీ అభ్యర్థుల పట్ల అన్యాయంగా వ్యవహరించిందన్న ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం 1956 ప్రకారం ఎమ్మెస్సీ/పీహెచ్‌డీను మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తీసుకోవచ్చు. అలాకాకుండా ఎండీ, ఎంఎస్/డీఎస్సీ ఉండాలని నిబంధన పెట్టడం, అదేవిధంగా డెంటిస్ట్రీ పోస్టును 'ఓరల్ మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ' చేసిన అభ్యర్థులు కావాలని చెప్పడంపై విమర్శలకు దారితీసింది. ఈనేపథ్యంలో వాటి రిక్రూట్‌మెంట్‌ను పక్కన పెడుతూ నిర్ణయం తీసుకున్నట్టు డైరెక్టర్ తెలిపారు. నోటిఫికేషన్‌లోని 104 పోస్టులకు గాను 315 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రస్తుతం స్క్రూటినీ జరుగుతోందన్నారు. తర్వాత ఎంఎస్సీ, పీహెచ్‌డీ చేసినవారికి అవకాశం ఉంటుందన్నారు. అభ్యంతరాలతో పాటు తుది జాబితాను టీటీడీ ఛైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళతామన్నారు. ఫ్యాకల్టీ నోటిఫికేషన్ పూర్తిగా రద్దయిందన్న వార్తల్లో నిజంలేదన్నారు.

గుత్తివారిపల్లె ఘటనపై కలెక్టర్ ఆగ్రహం

- ఈవోపీఆర్డీ సస్పెన్షనుకు ఆదేశాలు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వీఆర్వోలపైనా చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గుత్తివారిపల్లెలో డయేరియాతో ఒకరు మృతిచెందిన ఘటనపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. ఈవోపీఆర్డీ ప్రభురెడ్డిని సస్పెండు చేయాలంటూ డీపీవో సుశీలాదేవిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పలు అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. గుత్తివారిపల్లెలో డయేరియా ఘటనను ప్రస్తావిస్తూ అనూహ్య సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమివ్వకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డయేరియా విషయంలో నిర్లక్ష్యం వహించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వీఆర్వోపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్ సూపర్‌వైజర్లనూ బాధ్యుల్ని చేయాలన్నారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు డ్రోన్ల నిఘా

- 950 మంది పోలీసు బలగాలతో బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి జాతరకు ఈసారి ఐదు డ్రోన్లతో నింగి నుంచీ నిఘా పెట్టనున్నారు. ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలూ ప్రతి సంఘటననూ క్యాప్చర్ చేయనున్నాయి. గత ఐదేళ్ల అనుభవాలు, ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ హర్షవర్ధనరాజు భద్రతా చర్యలు చేపట్టారు. ఇప్పటికే అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, ఎస్పీ డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు, ఎస్ఐలు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి, స్థానిక నాయకులతో సమావేశమై జాతర ఏర్పాట్లపై చర్చించారు. బుధ, గురువారాల్లో పోలేరమ్మ జాతరకు 950 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్టీఎఫ్.. మూవింగ్ పార్టీలనూ నియమించారు. జాతరలో ఊరేగింపుతో పాటు నిమజ్జనం, భక్తుల తాకిడి ఎక్కువగా వున్న ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లు ఏర్పాటుచేసి భక్తులకు అవగాహన కల్పించేలా సిబ్బందిని నియమించారు. మరరోవైపు గూడూరు డివిజన్ పరిధిలోని ఆకతాయిలు, రౌడీ షీటర్లు, మద్యం మత్తులో గొడవలు సృష్టించే వారిని బైండోవర్ చేసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. భక్తుల వాహనాలకు 8 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశారు. వాహనాలన్నీ వచ్చే దారిలోనే తిరిగి వెళ్లేలా రూట్ మ్యాప్‌లు సిద్ధం చేశారు.



తోక జాడిస్తే జైలుకే

ప్రశాంతంగా జాతర నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఎవరైనా విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తే జైలుకు పంపిస్తాం. రద్దీ ఎక్కువగా ఉండే చోట డ్రోన్లు వినియోగించి ఆకతాయిల ఆగడాలను కట్టడి చేస్తాం. గతేడాది జాతరలో అల్లర్లు సృష్టించిన వారి కదలికలపై నిఘా ఉంచాం.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ

అనధికార శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తే చర్యలు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో అనధికారిక శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది. యూకేలోని శ్రీఅద్వైత సేవా సమితి పేరుతో ఓ సంస్థ యూనైటెడ్ కింగ్డమ్‌లో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టుగా ఆహ్వానపత్రికను వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. దీనికి ఏపీఎన్ఆర్టీఎస్ నుంచి అనుమతి లేదని టీటీడీ స్పష్టంచేసింది. ఆహ్వాన పత్రికలో టీటీడీ లోగోను వాడటం భక్తులను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొంది.

సైబర్‌వలలో ప్రొఫెసర్ కుమార్తె

- రూ.90వేలకు టోకరా

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మ్యారేజ్ బ్యూరో ముసుగులో పరిచయం పెంచుకున్న ఓ సైబర్ మోసగాడి వలలో ఒక ప్రొఫెసర్ కుమార్తె మోసపోయింది. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు వెటర్నరీ వర్సిటీలో ఓ ప్రొఫెసర్ కుమార్తెకు తెలుగు మ్యాట్రిమోనీ ద్వారా సంజయ్ అనే పేరుతో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. మ్యారేజీ బ్యూరో పేరిట మాటలు చెబుతూ నమ్మపలికాడు. ఈ నెల 3న అత్యవసరంగా రూ.90,000 కావాలని వాట్సాప్ కాల్ ద్వారా అడిగాడు. ఆమె నమ్మి అతడు సూచించిన నంబరుకు ఆమొత్తాన్ని ఫోన్ ద్వారా బదిలీ చేసింది. తర్వాత ఇతడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేసింది.

యూరియా కొరతను అరికట్టండి

- వైసీపీ నేతల డిమాండు.. ఆర్డీవోకు వినతి


తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద వైసీపీ నేతల నిరసన

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతను అరికట్టి, రైతు సమస్యలపై స్పందించాలని వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు మంగళవారం తిరుపతిలోని అన్నమయ్య సర్కిల్‌నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. యూరియా కొరతను ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పీఏసీలకు చేరాల్సిన 50శాతం యూరియాని దారిమళ్లించి ప్రైవేటు వ్యక్తులు కొరతను సృష్టించి బ్లాక్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని మేయర్ డాక్టర్ శిరీష, వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు చంద్రమౌళిరెడ్డి, మాధవరెడ్డి, మల్లం రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ మునికృష్ణ, లక్ష్మీనారాయణ శివశంకర్‌రాజు, అశోక్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైసీపీ చేపట్టిన ర్యాలీలో రైతుల కన్నా యువతే ఎక్కువగా కనిపించారు. 50మంది తక్కువ కాకుండా తీసుకరావాలని కార్పొరేటర్లు, ప్రధాన లీడర్లకు స్థానిక అధిష్ఠానం ఆదేశించినట్లు సమాచారం. దీంతో వాళ్లంతా యువతను, మహిళలను వెంటబెట్టుకుని వచ్చారు. రైతులు చాలా తక్కువ సంఖ్యలో కనపడ్డారు. కాగా, జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలకూ అక్కడి వైసీపీ నేతలు వినతిపత్రాలిచ్చారు.

20.84 లక్షల మందికి ఉచిత ప్రయాణం

- ఆ బస్సులపై స్త్రీశక్తి లోగో వేయాలన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి మంగళవారం వరకు 20.84లక్షల మంది మహిళలు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తద్వారా వారు సుమారు రూ.8.66 కోట్లు లబ్ధి పొందారన్నారు. జిల్లాలోని 11మంది ఆర్టీసీ డిపో మేనేజర్లతో మంగళవారం కలెక్టర్ జూమ్‌మీటింగ్ నిర్వహించారు. ఈ పథకం అమలయ్యాక తిరుపతి నుంచి శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, చిత్తూరు, గూడూరు ప్రాంతాల్లో వారాంతం, పండుగ రోజుల్లో అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని డీఎంలను ఆదేశించారు. ఉచిత ప్రయాణ సదుపాయమున్న బస్సులను మహిళలు సులభంగా గుర్తించేలా వాటిపై స్త్రీశక్తి లోగోను ఏర్పాటు చేయాలన్నారు. ఈ బస్సుల వేళలు, వాటి ట్రాకింగ్‌యాప్‌ను రూపొందించాలన్నారు.



కూరగాయల దాతలతో వాట్సాప్ గ్రూపు

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచన.. బ్రహ్మోత్సవాల్లో రోజుకు పది టన్నులు అవసరం

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదాలకు కూరగాయలు విరాళంగా టీటీడీకి అందజేస్తున్న దాతలతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచించారు. కూరగాలయ దాతలతో బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల అన్నప్రసాద విస్తరణ చేసిన నేపథ్యంలో దాతలు మరింత ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ప్రస్తుతం దాతలు రోజుకు 25 రకాల కూరగాయలు, 6 నుంచి 7 టన్నులు అందజేస్తున్నారని, బ్రహ్మోత్సవాల సమయంలో రోజుకు 10 టన్నులు అవసరముంటుందని అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్రకుమార్, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి వివరించారు. కూరగాయల విరాళాలు 2022లో 5.79 శాతం నుంచి 2025లో దాదాపు 7 శాతానికి పెరిగాయని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, ఏపీకి చెందిన కూరగాలయ దాతలను వెంకయ్య చౌదరి శ్రీవారిప్రసాదాలతో సత్కరించారు.



శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


ఆదివారం హుండీ ఆదాయం: రూ.2.10 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,117

తలనీలాలు సమర్పించినవారు: 22,765



ఆశ పెంచుకో..
ఆ ఆలోచన తుంచుకో



ఈ పక్కన ప్రస్తావించిన రెండూ ఉదాహరణలు మాత్రమే. మొబైల్ కొనివ్వలేదనో.. మార్కులు రాలేదనో.. ఆశించిన ర్యాంకు పొందలేదనో.. ప్రేమ విఫలమైందనో.. ఆర్థిక బాధలతో వేగలేకో.. కుటుంబ స్పర్థలతోనో.. కుంగుబాటుతోనో .. ఇలా రకరకాల కారణాలతో, క్షణికోద్రేకంతో కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తమ మీద ఆశలు పెట్టుకున్న కుటుంబ సభ్యులను విషాదం లోకి నెట్టేస్తున్నారు. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇలాంటి వారిని గుర్తించి భుజం తట్టి..సాంత్వన కలిగిస్తే మరణాన్ని ఆశ్రయించరని చెబుతున్నారు మానసిక నిపుణులు. బుధవారం ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథకం.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

- ఈ ఏడాది జూన్ 25న తొట్టంబేడులో పంట,వ్యక్తిగత రుణాల తీర్చలేక ఆందోళన చెంది రామయ్య(56) అనే రైతు ఉరి వేసుకుని మృతి చెందాడు.
- కోటలో కూలీ పనులు చేసుకునే చల్లప్పన్(28) రకరకాల కష్టాలు వెంటాడటంతో బతుకుపై విరక్తి పెంచుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.





సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ పాటలో..నొప్పిలేని నిమిషమేది జననమైన మరణమైన జీవితాన అడుగు అడుగునా...నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీదికాదు బతుకు అంటే నిత్య ఘర్షణ..అని జీవితం గురించి రెండు ముక్కల్లో చెబుతారు. కానీ కొందరు ఏ కష్టం కలిగినా తట్టుకోలేరు. పెద్ద ఉపద్రవం మీదపడినట్టు భావిస్తారు. తమకే కష్టాలొస్తున్నాయని డీలాపడిపోతారు. ఈక్రమంలోనే క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడుతుంటారని మానసిక శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఆత్మహత్యల సంఖ్య కొంతమేర తగ్గడం శుభసంకేతంగా పోలీసులు పేర్కొంటున్నారు. గత ఏడాది దాదాపు 102 మంది బలవన్మరణాలకు పాల్పడగా గత నెల వరకు 79 మంది ప్రాణాలు తీసుకున్నట్లు జిల్లా క్రైం బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి.

ఎందుకీ విపరీత ధోరణులు

అయిన దానికీ కానిదానికీ కొందరు విపరీత ధోరణి కోణంలో చూస్తుంటారు. తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. నైరాశ్యాన్ని నింపుకొంటారు. ఇలాంటి పరిస్థితుల్లోనే క్షణికావేశంలో తనువు చాలించాలని నిర్ణయించుకుంటారు. వీరెవరూ కష్టాలను తట్టుకోడానికి సిద్ధపడరు. పరిష్కారంపై దృష్టి పెట్టరు. ప్రతిదానికీ పరిష్కారమో, ప్రత్యామ్నాయయో ఉంటుందని గుర్తించరు. ఈ అంతర్ముఖులు తమ సమస్య, ఆందోళన, మానసిక ఒత్తిడి గురించి ఎవరితోనూ పంచుకోరు. ముభావంగా, ఒంటరిగా ఉంటుంటారు. ఇలాంటి మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారిని కుటుంబసభ్యులో, బంధువులు లేదా స్నేహితులో గుర్తించాలి. కౌన్సెలింగ్ ఇచ్చేలా ధైర్యవచనాలు చెబితే పెనుముప్పు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. సానుకూల దృక్పథం వీరికి నూరిపోస్తే జీవితంపై ఆశపెంచుకుని మరణం ఆలోచన దరిచేరనివ్వరంటున్నారు.

ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



పెరుగుతున్న న్యూక్లియర్ కుటుంబాలు, పిల్లలు దూరం కావడం, తగిన ఆర్థిక వనరులు లేకపోవడం, నిరంతర ఒత్తిడి, సాంఘిక వెసులుబాటు, పోటీ ప్రపంచంలో వెనుకబడటం, ఆరోగ్య సమస్యలతో ఎక్కువ మంది తీవ్రంగా మానసిక ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వారిలో. ఆందోళన, దిగులు, ముభావం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీరిలో కొందరు ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. ఈ లక్షణాలున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఒంటరిగా ఉంచకుండా ఎవరోఒకరు తోడుగా వుండాలి. వారి భావాలను ఖండించకుండా సహానుభూతితో మెలగాలి. సమస్యలపై చర్చించకూడదు. వివాద రహిత విషయాలు మాట్లాడాలి. నలుగురిలో కలుపుకోవాలి. అవసరమైతే మానసిక వైద్యుడ్ని సంప్రదించాలి.

- డాక్టర్ కిషోర్, సీనియర్ సైకియాట్రిస్టు, తిరుపతి

సానుకూల దృక్పథమే ఊపిరి



జీవితంలో సమస్యలు సహజం. అవి శాశ్వతం కావని గుర్తించాలి. సహనం, ధైర్యం ప్రదర్శిస్తే పరిష్కారాలు కనిపిస్తాయి. ఆత్మహత్య అంటే పిరికితనం. సమస్య నుంచి పారిపోవడం. కానీ ఇది పరిష్కారం కాదు. ఎంత కష్టమైన ఇబ్బంది ఎదురైనా పోతుందనే నమ్మకం సంపూర్ణ బలాన్నిస్తుంది. ఏ పరిస్థితిలోనూ ఆశను వీడకూడదు. ఆశ ఉంటే శ్వాస వెంటే అంటారు. అదే మార్గం చూపుతుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోందనే భావన కలిగితే ఆత్మీయుల దగ్గరకు వెళ్ళాలి. కుటుంబ సభ్యులను ప్రేమించడం,.క్షమాగుణం అలవర్చుకోవడం నేర్చుకోవాలి. తుది శ్వాస వరకు జీవితాన్ని ఆనందంగా గడపాలనే దృఢచిత్తం పెంచుకోవాలంటే సానుకూల వైఖరి పెంచుకోవాలి

- శ్రీలత, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ, తిరుపతి

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్‌కు చెక్కు అందజేస్తున్న దాత చిరంజీవి

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. రాజమండ్రికి చెందిన చిరంజీవి విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మహిళా క్రికెటర్



నల్లపురెడ్డి చరణి

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం భారత మహిళా క్రికెటర్ నల్లపురెడ్డి చరణి దర్శించుకున్నారు. ఈమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి కూడా స్వామి సేవలో పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మూడు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలోని పేథాలజీ విభాగంలో మూడు ప్రాజెక్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ అపర్ణబిట్లా ఒక ప్రకటనలో కోరారు. ప్రాజెక్టు అసోసియేట్, ప్రాజెక్టు అసిస్టెంటు పోస్టులతోపాటు వ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డీబీటీ నిదాన్ కేంద్ర, స్విమ్స్, తిరుపతికి పోస్టు ద్వారా పంపాలని ఆమె సూచించారు. ఈ నెల 27లోపు ఒరిజినల్ దరఖాస్తులతోపాటు సర్టిఫికెట్లను, ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలు, అప్లికేషన్ల కోసం స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని వివరించారు.

కంపల్లె రవిచంద్రన్‌కు కీర్తి పురస్కారం



తిరుపతి (కల్చరల్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : టీటీడీ సప్తగిరి మాసపత్రిక ప్రత్యేక శ్రేణి ఉపసంపాదకులు డాక్టర్ కంపల్లె రవిచంద్రన్ కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ నెల 23న జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ప్రాచీన సాహిత్య విభాగంలో తొమ్మిది, ఆధునిక సాహిత్య విభాగంలో ఏడు గ్రంథాలు, సినిమా సాహిత్య విభాగంలో 13 పుస్తకాలు, అనువాద సాహిత్య విభాగంలో ఆరు గ్రంథాలతోపాటు సుమారు ఐదువేల వ్యాసాలను రవిచంద్రన్ రాశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ కళారత్న పురస్కారం కూడా అందుకున్నారు.

పిల్లపాళెంలో ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న గ్రామస్తులు



పిల్లపాళెంలో ప్రైవేటు భూముల్లో 40 అడుగుల లోతుకు తవ్వడంతో నీటితో నిండిపోయిన గోతులు

రేణిగుంట సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాను పిల్లపాళెంవాసులు అడ్డుకున్నారు. మండలంలోని పిల్లపాళెంలో ప్రైవేటు భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు మంగళవారం ట్రాక్టర్లను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ఆ దారిలో వెళ్తున్న తమ పిల్లలకు ప్రమాదం జరుగుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గతంలో భూ యజమానికి హెచ్చరించామన్నారు. అయితే సదరు భూ యజమాని తిరుపతికి చెందిన వ్యక్తికి తన భూమిని లీజుకు ఇచ్చాడన్నారు. దీంతో నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోందన్నారు. సుమారు నలభై అడుగుల లోతు తవ్వేశారని, ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరిందన్నారు. ఆ గుంతల్లో తమ పిల్లలు ఈతకు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై లీజుదారుడి దృష్టికి తీసుకెళ్లామని అయినా పట్టించుకోకపోవడంతో అడ్డుకున్నామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా చెయ్యకుండా కందకాలు తవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న గాజులమండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోగా ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు తరలిపోయాయి.

తీర పోలీస్ స్టేషన్ మరమ్మతులకు ప్రతిపాదనలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంతాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ దుగరాజపట్నం కోస్టల్ పోలీస్‌స్టేషకు మరమ్మతులు, కాంపౌండ్ వాల్ నిర్మాణ అంశాలకు సంబంధించి అంచనాల ప్రతిపాదనలు పంపుతామన్నారు. మత్స్యకారులు వేటకు సమయంలో వెంట ఆధార్ కార్డు, బయోమెట్రిక్‌కార్డును తీసుకెళ్లేలా అవగాహన కల్పించాలని జిల్లా మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. తూపిలిపాళెం, దుగరాజపట్నం బీచ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మెరైన్ పోలీసులకు సూచించారు. దీనికి అవసరమైన నిధులు సమకూరుస్తామన్నారు. మన రాష్ట్రానికి చెందిన బోట్లను గుర్తించడానికి నిబంధనల మేరకు కలర్ కోడింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సముద్రంపై అక్రమ చేపల వేట జరగకుండా జిల్లా మత్స్యశాఖ, కోస్టల్ సెక్యూరిటీ అధికారులతో కలిసి జాయింట్ పెట్రోలింగ్ చేయాలన్నారు. తమిళనాడు నుంచి మత్స్యకారులు మెకనైజడ్ బోట్లతో అక్రమంగా మనవైపున్న సముద్ర జలాల్లో చేపలు పడుతున్నారని అధికారులు తెలపగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని కలెక్టరు చెప్పారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డిప్యూటీ ఎస్పీ వెంకటరమణ డిప్యూటీ ఎస్పీ కోస్టల్ సెక్యూరిటీ పోలీసు బాలిరెడ్డి, అధికారులు విజయకుమార్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తుడా ప్లాట్ల ఈ-వేలానికి విశేష స్పందన



ఈ-వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న డాలర్ దివాకర్ రెడ్డి

తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట-తిరుపతి హైవే మార్గంలో పద్మావతినగర్‌లోని సూరప్పకసం తుడా లేఅవుట్‌లోని తుడా స్థలాలను ఈ- వేలం ద్వారా విక్రయిస్తున్నారు. ఈనెల 4న ప్రారంభమైన ఈ-వేలం 17వ తేదీతో ముగియనుంది. 277 ప్లాట్లకు గాను ఇప్పటివరకు 35 ప్లాట్లు విక్రయించారు. తద్వారా దాదాపు రూ.13 కోట్ల మేర ఆదాయం లభించినట్టు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వేలం ప్రక్రియను పరిశీలించారు. వేలం వివరాలను తుడా సెక్రటరీ డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్‌బాబు వివరించారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చదరపు గజం రూ.14వేలకు ధర నిర్ణయించామని దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీఫైనల్స్ పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం నిర్వహించనున్నారు.ఉదయం 10 గంటలకు వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ధృతి ఆడిటోరియంలో కార్యక్రమం ప్రారంభంకానుంది.సాంకేతికత-సామాజిక సమస్యల పరిష్కారం అంశంపై విన్నూత్న ఆలోచనలకు ఇది వేదిక కానుంది. తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 220మంది విద్యార్థులు,పలు సాంకేతిక సంస్థలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. పాల్గొన్న వారికి వివిధ థీమ్‌లపై పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేస్తారు. దీంతోపాటు విజేతలనను ఫైనల్స్‌కు పంపనున్నారు.

పల్లంపేటలో దోపిడీ దొంగల అరెస్టు

- పోలీసుల అదుపులో కుదువ వ్యాపారి

ఏర్పేడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లో ఒంటరి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడడమే కాకుండా వారి ఆభరణాలను దోచేకెళ్లే వారిని అరెస్టు చేయడమేకాకుండా వారికి సహకరించిన కుదువ వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు... వెంటకగిరికి చెందిన ప్రసాద్ తన కారులో సొంతపనుల నిమిత్తం తిరుపతికి గతనెల 30న బయలుదేరాడు. మార్గమధ్యంలోని పల్లంపేట వద్ద కారు మరమ్మతులకు గురైంది. దీంతో రోడ్డుపక్కన కారును మరమ్మతులు చేసుకుంటుండగా శ్రీకాళహస్తి మండలం ఇంద్రపల్లికి చెందిన ప్రసాద్, పాతగుంట దళితవాడకు చెందిన హరి కారు యజమాని ప్రసాద్‌ను పలకరించారు. మరమ్మతులకు సహకరించారు. రాత్రి 8 గంటలైనా కారు రిపేర్‌కాలేదు. ఈక్రమంలో ముగ్గురు కలిసి సమీపంలో బ్రాందీషాపులో మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ బంగారు నగలను, సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోయారు. మత్తు నుంచి తేరుకున్న ప్రసాద్ తన వస్తువులు చోరీ అయినట్లు గుర్తించాడు. మూడు రోజుల పాటు ఇంద్రపల్లికి, పాతగుంట దళితవాడకు వెళ్లి నగలు, సెల్‌ఫోన్ ఇవ్వాలని కోరారు. వారు నగలను పల్లంపేటలో ఉన్న ఓ కుదువ వ్యాపారికి కుదువ పెట్టినట్టు చెప్పారు. దీనిపై ప్రసాద్ ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి విచారణ చేపట్టారు. విచారణలో చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీ చేసిన ఇద్దరిని, కుదవు పెట్టుకున్న వ్యాపారిని మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- నయా పంథా

గ్యాస్ కట్టర్‌తో తలుపు కోసి...!

వాంపల్లెలో చోరీకి పాల్పడ్డ దొంగలు



తలుపును గ్యాస్ కట్టర్‌తో కాల్చిన దుండగులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): శబ్దం రాకుండా సరికొత్త విధానంతో దొంగలు చెలరేగారు. గ్యాస్‌కట్టర్‌తో తలుపును కాల్చి ఇంట్లోని బంగారు ఆభరణాలను లూటీ చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం వాంపల్లెలో జరిగింది. నెల రోజుల వ్యవధిలో వాంపల్లిలో ఆరు వరుస చోరీలు వెలుగు చూశాయి. ఇంటికి తాళం వేసినట్లు కనిపిస్తే చాలు.. రాత్రికి రాత్రే దొంగలు తెగబడుతున్నారు. ఒంటరి మహిళగా జీవనం సాగించే కరణం బుజ్జమ్మ సోమవారం రాత్రి సమీప గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఉదయం ఇంటికి చేరుకోగానే ప్రధాన ద్వారాన్ని కాల్చి దొంగలు లోపలకు చొరబడినట్టు గుర్తించింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ గోపి క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వరుస చోరీలు జరగడంపై లోతుగా ఆరా తీశారు. ప్రత్యేకించి మంగళవారం వెలుగు చూసిన చోరీలో శబ్దంరాకుండా గ్యాస్‌కట్టర్ ఉపయోగించడంతో పరిసరాల్లో పలు నమూనాలను సేకరించారు. మహిళ ఫిర్యాదు మేరకు 16 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



చోరీపై విచారణ చేస్తున్న సీఐ గోపి

ఐదుగురు స్మగ్లర్ల అరెస్టు

- 9 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం రాజంపేట అటవీపరిధిలోని ఎస్ఆర్‌పాళెం ఫారెస్టు బీటులో మంగళవారం కూంబింగ్ నిర్వహించారు. ఈక్రమంలో రాళ్లమడుగు తుమ్మలబైలు జంక్షనుకు చేరుకోగా కొంతమంది ఎర్రచందనం దుంగలు మోసుకువెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటబడ్డారు. వారిని వెంబడించి ఐదుగిరిని పట్టుకున్నారు. వారి నుంచి 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారు తమిళనాడుకు చెందినవారుగా గుర్తించారు. దుంగలతో సహా స్మగ్లర్లు తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మా గ్రామం వద్ద డంపింగ్ యార్డు వద్దు

కలెక్టరుకు కొణ్ణంబట్టు గ్రామస్తుల వినతి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామం సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దని కోరుతూ కొణ్ణంబట్టు గ్రామస్తులు మంగళారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవలే సూళ్లూరుపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డు కోసం కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 131లో 10 ఎకరాల భూమిని కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీ అధికారులు పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్త, వ్యర్థాలను డంపింగ్ యార్డు వద్దకు ట్రాక్టర్లలో తీసుకెళ్లగా సమీపంలోని కొణ్ణంబట్టు, పెరిమిటిపాడు, లక్ష్మీపురం గ్రామస్తుల అడ్డుకుని ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో మూడు గ్రామాల చెందిన ప్రజలు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

టీడీపీ సీనియర్ నేత వేణుగోపాల్ మృతి



వేణుగోపాల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్

తడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ బోడిలింగాలపాడు వేణుగోపాల్(65) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగిన వేణుగోపాల్ తడ మండల అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం కొనసాగారు. తడ కండ్రిగ పంచాయతీ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు ఎన్నికయ్యారు. వేణుగోపాల్ మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, సెల్వం, పళణి, ఏకాంబరం, రవి, వైఎస్ఆర్ ట్రైడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జయకుమార్‌రెడ్డి, వైసీపీ నాయకుడు ఆర్ముగం, తిరుమలరెడ్డి, ఉచ్చూరు మునస్వామిరెడ్డి, సీపీఐ నాయకులు సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బాలగురవం తదితరులు వేణుగోపాల్ ఇంటికి చేరుకొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

దొరవారిసత్రం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలోని బీసీ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థులకు భూసార పరీక్షలపై వ్యవసాయాధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. జిల్లా భూసార పరీక్షా కేంద్రం ఇన్‌చార్జి ఏడీఏ శ్రీనివాస చక్రవర్తి విద్యార్థులకు మట్టి పరీక్ష ప్రాముఖ్యతను వివరించారు. పంటల సాగులో భూసార పరీక్షలు తప్పనిసరి అని, రైతులు అవగాహన లేక రసాయనిక ఎరువులను ఎక్కువ మోతాదులో వాడేస్తున్నారని తెలిపారు. మట్టి నమూనాలను సేకరించడం, పరీక్షలు చేయించుకోవడం, నాణ్యత, లోపాలను గుర్తించి, దానికి అనుగుణంగా ఎరువులు వాడకం, పంటలు పెంపకం చేపట్టాని వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా భూసార పరీక్షా కేంద్రం ఏవోలు కల్యాణబాబు, పుష్పాంజలి, డీఆర్‌సీ ఏవో శ్రీనివాసులు, రాజీవన, స్థానిక ఏవో జ్యోతిర్మయి పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుడి పనితీరుపై విచారణ

కోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మానాయుడు పాళెంలో మంగళవారం ఉపాధి క్షేత్రసహాయకుడి పనితీరుపై విచారణ జరిగింది. క్షేత్రసహాయకుడి పనితీరు బాగాలేదని, అతనిని తొలగించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలంటూ తిమ్మానాయుడుపాళెం గ్రామానికి చెందిన కొంతమంది ఉపాధి పీడీ శ్రీనివాస ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఉపాధి ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ విచారణ చేపట్టారు. ప్రస్తుతం కొనసాగుతున్న క్షేత్ర సహాయకుడి పనితీరు బాగుందని, అతనినే కొనసాగించాలని స్థానికులు చెప్పారు.

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్ష ఏపీసీ గౌరీశంకర్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి తీసుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయలకు సూచించారు. విద్యార్థులకు మంచి భోజనం అందించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే దివ్యాంగ పిల్లలకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలింపుపై ఘర్షణ

పెళ్లకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామంలో గ్రావెల్ తరలింపు విషయంలో గ్రామస్తులకు, గ్రావెల్ రవాణా చేస్తున్న వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో నుంచి టిప్పర్లలో గ్రావెల్ తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తే ఊరుకోబోమన గ్రామస్తులు స్పష్టం చేశారు. దీంతో రెండు వర్గాల మధ్య తోపులాటు చోటుచేసుకని ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.



కాశీపేట సెంటర్ వద్ద కళాకారుల కోలాటం

మొదలైన జాతర సందడి



పోలేరమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలకరణ

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందడి మొదలైంది. బుధ, గురువారాల్లో జాతర నిర్వహించేందుకు దేవదాయశాఖ, మున్సిపాలిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఒక్కరికీ అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం ఘటోత్సవంతో జాతర మొదలైన విష యం తెలిసిందే. అప్పటి నుంచే వివిధ ప్రాంతా నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. పోలేరమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణతో ఆకట్టుకుంటోంది. పట్టణంలోని పలు కూడళ్లలో కటౌట్లు ఏర్పాటు చేశారు. పట్టణంలో అమ్మవారి ఊరేగింపు జరిగే రాజవీధిలో చెట్ల కొమ్మలను తొలగించారు. జాతర సందర్భంగా పట్టణంలో సంచార దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రంగులరాట్నం, ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి జాతర ఏర్పాట్లను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు.

సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభను విజయవంతం చేయండి

గూడూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్ సిక్స్ - సూపర్‌హిట్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బహిరంగ సభ సన్నాహక చర్యలపై మంత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంతో సూపర్ సిక్స్ - సూపర్ హిట్ పేరుతో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

పెళ్లకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేసి చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు మల్లు ప్రసాద్, కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పెళ్లకూరులో వారు మీడియాతో మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధి కోసం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై కలెక్టర్, డీపీవో, ఎంపీడీవోలకు వినతిపత్రం అందించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. విచారణ పూర్తయ్యేంత వరకు నిధులు వినియోగాన్ని నిలిపి వేయాలన్నారు. కార్యక్రమంలో శిరసనంబేటి సుందరరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సురేష్, చంద్రయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించండి



గుడూరులో వైసీపీ నాయకుల ర్యాలీ - సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే కిలివేటి ఆధ్వర్యంలో వైసీపీ నాయకుల నిరసన

గూడూరు అర్బన్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్ నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ప్రదర్శనగా వెళ్లి సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కల్పలత, విజయ్ కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, భక్తవత్సలరెడ్డి, సంపత్‌రెడ్డి, సుబ్బారావు, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలోని వినాయకుడి గుడి సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరారు. హోలీక్రాస్ కూడలి వద్ద పోలీసులు ర్యాలీకి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నాయకులు వేర్వేరుగా ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, నాయుడుపేట మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ దీపిక, సూళ్లూరుపేట మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆరిమేనిపాడు ఎంపీటీసీ మృతి



రఘురామరాజు (ఫైల్‌ఫొటో)

ఓజిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు గుంటమడుగు రఘురామరాజు(65) గుండెపోటుతో మృతి చెందారు. గూడూరులోని కుమారుడి ఇంట్లో ఉంటున్న ఆయనకు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కన్నుమూశారు. భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వెంకటగిని వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఓజిలి మండల వైసీపీ కన్వీనరు పాదర్తి హరినాద్‌రెడ్డి తదితరులు ఆరిమేనిపాడుకు గ్రామానికి వెళ్లి రఘురామరాజు భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై సీఆర్పీలకు శిక్షణ

బాలాయపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లిలోని చెత్తతో సంపద తయారీ కేంద్రం వద్ద మంగళవారం డివిజన్‌లోని సీఆర్పీలకు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో వాణిరెడ్డి మాట్లాడుతూ సీఆర్పీలు వారి పరిధిలోని కుటుంబాలకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్‌లకు అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దట్టం అంజలి, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ఎంపీడీవో వినీల్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం, గూడూరు డివిజన్ కోఆర్డినేటర్ రవి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

కోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని యానాదుల బాలికల పాఠశాలలో మంగళవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. సీడీపీవో మునికుమారి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థినులు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బేటీ బచావో - బేటీ పడావో సంకల్ప పథకం గురించి అవగాహన కల్పించారు.





నష్టపరిహారం అందించాలని నిరసన



సాగరమాల రోడ్డు పనుల వద్ద రైతులు నిరసన

చిల్లకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొణుకుమాల సమీపంలో సాగరమాల రోడ్డు నిర్మాణానికి భూమిచ్చిన రైతులు నష్టపరిహారం చెల్లించాలంటూ మంగళవారం నిరసన తెలిపారు. సాగరమాల రోడ్డు నిర్మాణానికి తాము భూములిస్తే, ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జలీల్ అహ్మద్, టీడీపీ నాయకులు

కోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్ ఆధ్వర్యంలో కోట ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. రవినగర్‌లో 500 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలకృష్ణంరాజు సహకారంతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. డాక్టర్ షరీనా, బాలకృష్ణంరాజు, నాగరాజు, చెంచునారాయణ తదితరులు పాల్గొన్నారు.

